ANN తెలుగు
Follow: @ANNTELUGU
04-01-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 34 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## గ్రేటర్‌కు నీటి కొరత రావొద్దు
**సీఎం రేవంత్ రెడ్డి**

2050 నాటికి పెరిగే జనాభాకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించండి

- ఫ్యూటర్ ప్లాన్‌పై మెట్రో వాటర్ బోర్డు అధికారులకు సీఎం దిశా నిర్దేశం
- ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజ్ ప్లాన్‌ను సిద్ధం చేయండి
- మల్లన్న సాగర్ నుంచి నగరానికి నీటి లిఫ్టింగ్‌కు అనుమతి
- 20 టీఎంసీల తరలింపునకు అనుమతి.. బోర్డు రెవెన్యూ లోటు రూ. 8800 కోట్లు
- ప్రభుత్వం విభాగాల బకాయిలు రూ. 4300 కోట్లు
- జల మండలి విద్యుత్ బకాయిలు రూ. 5500 కోట్లు
- సీఎంకు తెలిపిన జల మండలి ఎండీ అశోక్ రెడ్డి

వివరాలు 2లో

**పొలిటిక్స్**

### ఢిల్లీకి ఆపదగా ఆమ్ ఆద్మీ సర్కార్
- పాఠశాల విద్య నుండి మద్యం వ్యాపారం దాకా అవినీతే
- మండిపడ్డ ప్రధాని నరేంద్రమోదీ



02

### అధికారులను బకరా చేసిన కేటీఆర్
- ఆస్తులపై చర్చకు రా తేల్చుకుందాం
- మాజీ మంత్రి కేటీఆర్‌కు షబ్బీర్ అలీ సవాల్




03

### బీఆర్ఎస్ తోడేళ్ళ గుంపు లాంటిది
- భక్షించడమే తప్ప రక్షించడం తెలియదు
- బీసీల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కవిత ప్రయత్నాలు: మంత్రి సీతక్క




03




### చైనాలో మరో కొత్త వైరస్ విజృంభణ
దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ?
న్యుమోనియా తరహా వైరస్.. కోవిడ్ తీవ్రత

వివరాలు 4లో



### బన్నీకి బెయిల్
పుష్ప 2 ప్రీమియర్ షో కేసులో అల్లు అర్జున్ కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

వివరాలు 2లో




# గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ
**2030 నాటికి 2 వేల మెగావాట్ల పెట్టుబడులే లక్ష్యం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

*"దేశ ప్రగతిలో ఐఐటీలది కీలక పాత్రని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఐఐటీ హైదరాబాద్ కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదని, ఆవిష్కరణలకు కేంద్రబిందువు అని కొనియాడారు. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్ రీసెర్చ్ హబ్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. 2030 నాటికి 2వేల మెగావాట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్‌పై పెట్టుబడులు పెడతామని వెల్లడించారు. ఖనిజ ఉత్పత్తుల కోసం ఐఐటీతో సింగరేణి ఒప్పందం సంతోషకరమైన విషయమని చెప్పారు.*

- మహా, హైదరాబాద్

02

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 79,200 |
| 22 క్యారెట్ | 72,600 |
| సిల్వర్ (కేజీ) | 92,500 |

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,223.11 |
| నిఫ్టీ ↗ | 24,004.75 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.25 | 157.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.25 | 157.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.57 | 170.01 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర | 160 | 200 | 210 |

## తెలంగాణ మణిహారం రీజినల్ రింగ్ రోడ్
**భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయండి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రాలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ మణిహారం రీజినల్ రింగ్ రోడ్ కు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను

మిగతా 2లో



### రైతులు మళ్లీ ఎందుకు ప్రమాణ పత్రాలు ఇవ్వాలి..?
సర్కారుపై మండిపడ్డ కేటీఆర్

వివరాలు 3లో



### పదేళ్లు బీసీలను అణగదొక్కి ఇపుడు డ్రామాలా?
కవితపై పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఫైర్

వివరాలు 3లో



## ఆదిలాబాద్‌లో ఆయుత చండీయాగం
**విశ్వశాంతి మహాయాగంలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు**

12రోజులుగా వైభవంగా సాగుతున్న యాగం

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి ఆయుత చండీయాగం లో పాల్గొన్నారు. గత 12 రోజులుగా ఆదిలాబాద్ లోని డైట్ కాలేజీ మైదానంలో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగానికి కంది శ్రీనివాస రెడ్డి సతీ సమేతంగా హాజరై హోమగుండం వద్ద పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని చండీ అమ్మవారిని ప్రార్థించారు.

## ఆ రెండు పార్టీలదే నిర్లక్ష్యం
**నాది తప్పయితే రాజకీయాల నుండి తప్పుకుంటా**

బీసీ మహాసభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మహా :** బీసీలకు రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయని, నేను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బీసీ మహాసభలో కవిత పాల్గొని ప్రసంగించారు.

మిగతా 2లో



## బీసీలపై కవితది కపట ప్రేమ
**చిత్తశుద్ధి ఉంటే బీసీలకు బీఆర్ఎస్ పదవులు ఇవ్వాలి**

కవితకు మంత్రి పొన్నం స్ట్రాంగ్ కౌంటర్

కులగణన రిపోర్టును పబ్లిక్ డొమైన్‌లో పెడతాం

**హైదరాబాద్, మహా :** బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ, బీసీల కోసం మాట్లాడుతున్నందుకు సోదరి కవితకి అభినందనలు అని అన్నారు.

మిగతా 2లో



## ఫార్ములా ఈ-కార్ కేసు
**కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు**

ఈనెల 6న విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, మహా :** ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో అవినీతి నిరోధక శాఖ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈనెల 6న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది.

మిగతా 2లో



# గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ



## 2030 నాటికి 2 వేల మెగావాట్ల పెట్టుబడులే లక్ష్యం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా:** దేశ ప్రగతిలో ఐఐటీలది కీలక పాత్రని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఐఐటీ హైదరాబాద్ కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదని, ఆవిష్కరణలకు కేంద్రబిందువు అని కొనియాడారు. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఆస్ట్రేలియాఇండియా క్రిటికల్ మినరల్ రీసెర్చ్ హబ్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. 2030 నాటికి 2వేల మెగావాట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్‌పై పెట్టుబడులు పెడతామని వెల్లడించారు. ఖనిజ ఉత్పత్తుల కోసం ఐఐటీతో సింగరేణి ఒప్పందం సంతోషకరమైన విషయమని చెప్పారు.

**ఐఐటిలు ఆవిష్కరణలకు కేంద్రబిందువులు**

దేశ ప్రగతిలో ఐఐటీలది కీలక పాత్రని, మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఈ ఆధునిక దేవాలయాలైన ఐఐటీలకి అంకురార్పణ చేశారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఐఐటీ హైదరాబాద్ విద్యాసంస్థ కాదని, ఆవిష్కరణలకు కేంద్ర బిందువని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఫ్లోటింగ్ సోలార్‌పై పెట్టుబడులు పెడుతామని, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ ను మారుస్తామని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సంగారెడ్డికి ఐఐటీ వచ్చిందని భట్టి గుర్తు చేశారు. వైఎస్ రాజకీయ నేతే కాదు.. విజన్ ఉన్న గొప్ప నాయకుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు.

### జగ్గారెడ్డి గైర్హాజరుపై చర్చ

**సంగారెడ్డిలో జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓ అధికారిక కార్యక్రమానికి భట్టి హాజరయ్యారు. అయితే సంగారెడ్డి జిల్లాలో ఏ అధికారిక కార్యక్రమం జరిగినా ముందుండే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సదరు మీటింగ్‌కు డుమ్మా కొట్టడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. జగ్గారెడ్డి మీటింగ్‌కు హాజరు కాకపోవడంపై ఆ పార్టీ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతున్నది.**





# ఢిల్లీకి ఆపదగా ఆమ్ ఆద్మీ సర్కార్

### పాఠశాల విద్య నుండి మద్యం వ్యాపారం దాకా అవినీతే

### మండిపడ్డ ప్రధాని నరేంద్రమోదీ

**ఢిల్లీ, మహా:** ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీకి ఆపదగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఆపద పదేళ్ల నుంచి దేశ రాజధానిని తన గుప్పిట్లోకి తీసుకుందని దుయ్యబట్టారు. ఆప్ పాలన ఇంకా కొనసాగితే ఢిల్లీ పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దిల్లీలో గృహ, విద్యా రంగాలకు చెందిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం రాంలీలా మైదానంలో జరిగిన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ క్రమంలో ఆప్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై మండిపడ్డారు. "ఒకవైపు ఢిల్లీ అభివృద్ధి కోసం కేంద్రం చాలా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు ఢిల్లీలోని ఆప్ సర్కార్ కేంద్రంపై అబద్ధాలు ప్రచారం చేస్తోంది. పాఠశాల విద్య, కాలుష్యంపై పోరాటం, మద్యం వ్యాపారం వరకు అనేక రంగాల్లో ఆప్ సర్కార్ అవినీతికి పాల్పడుతోంది. ఢిల్లీలో ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆపద ప్రభుత్వం కేంద్రంపై యుద్ధం ప్రారంభించింది. దాని నుంచి బయటపడాలని నిర్ణయించుకున్నాను. "అని నరేంద్రమోడీ అన్నారు.



# బన్నీకి బెయిల్

### పుష్ప 2 ప్రీమియర్ షో కేసులో అల్లు అర్జున్ కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, మహా :** నటుడు అల్లు అర్జున్ కు భారీ ఊరట లభించింది. మధ్యంతర బెయిల్ పై ఉన్న ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజరు చేస్తూ హకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర బెయిల్ పై ఉన్న అల్లు అర్జున్ తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై ఇరు పక్షాల వాదనలు జరిగి తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించింది. డిసెంబర్ 4న పుష్ప బెనిఫిట్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసినపోలీసులు దాదాపు 11 రోజుల తర్వాత అల్లు అర్జున్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, గత నెల 27న రిమాండ్ ముగిసింది. అదే రోజు ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అప్పుడే ఆయన తరపు లాయర్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ విచారణ వాయిదా పడగా, సోమవారం నాంపల్లి కోర్టు విచారణ చేపట్టి, ఇరు పక్షాల వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది. రూ. 50 వేల బాండు, ఇద్దరి పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# గ్రేటర్‌కు నీటి కొరత రావొద్దు : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** రాబోయే 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని గ్రేటర్ హైదరాబాద్ లో మంచినీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్ ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలన్నారు. ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం హైదరాబాద్ జల మండలి బోర్డు సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డు సమావేశమవటం ఇదే తొలిసారి. బోర్డు ఛైర్మన్ హోదాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండబ్ల్యుఎస్ ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో ఉన్న జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు సీఎంకు అధికారులు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి సిటీకి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని, గోదావరి ఫేజ్ 2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్ ను నీటి వనరుగా ఎంచుకోవాలా అనే అంశంపై సమావేశంలో చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతో పాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని వివరించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ. 4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, కరెంటు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, దాదాపు రూ. 8,800 కోట్ల రెవిన్యూ లోటు ఉందని వివరించారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. జల మండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్లు తయారు చేయించాలని చెప్పారు.

మంజీరా నుంచి 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



# ఆ రెండు పార్టీలదే నిర్లక్ష్యం

### నాది తప్పయితే రాజకీయాల నుండి తప్పకుంటా

### బీసీ మహాసభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

(మొదటిపేజీ తరువాయి)

ఈ దేశ మొదటి ప్రధాని నెహ్రూ కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించారు. ఇది బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం కాదా..? మండల్ కమిషన్ మొరార్జీ దేశాయ్ నియమించారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదు. మండల్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ పార్టీ తొక్కిపెట్టింది కానీ అమలు చేయలేదు. 1980లో మండల్ కమిషన్ నివేదిక ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదు..? మళ్లీ కాంగ్రెసేతర ప్రధాని వీపీ సింగ్ వచ్చినప్పుడే కమిషన్ నివేదికను అమలు చేసింది. బీసీల కోసం పని చేస్తున్న వీపీ సింగ్ ప్రభుత్వాన్ని బీజేపీ పార్టీ కూలగొట్టింది అని కవిత గుర్తు చేశారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగింది. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని రాజీవ్ గాంధీ అన్నారు. 2011 కులగణన చేసిన నివేదికను అప్పటి యూపీఏ ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. ఆ తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం కూడా నివేదిక బయటపెట్టలేదు. కులగణన చేయబోమని బీజేపీ స్పష్టం చేసింది. రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయి.

**రాజకీయాల నుండి తప్పకుంటా**

**నేను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పకుంటానని కవిత సవాల్ విసిరారు. కేవలం ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీసీలకు న్యాయం చేశాయి. కేసీఆర్, ఎన్టీఆర్ వంటి ప్రాంతీయ పార్టీల నాయకులు మాత్రమే బీసీలకు న్యాయం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా బీసీలకు జరిగిన లాభం ఏమిటో ఆలోచించాలి. సావిత్రీబాయి పూలే ఆడబిడ్డ కాదు... పులిబిడ్డ. మహిళా విద్యాకు ఎంతగానో కృషి చేశారు. ఎంతో మంది మహిళలకు చదువును నేర్పించారు సావిత్రీబాయి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమాజ వికాసం కోసం పని చేశారు అని కవిత ప్రశంసించారు.**

# వణికిస్తున్న చలి పులి

### సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మహా :** రాష్ట్రాన్ని చలి వణికిస్తుంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ కు పడిపోయాయి. రాష్ట్రంలో చలి కారణంగా ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సింగల్ డిజిట్ కు చేరుకోవడంతో విపరీతంగా పెరిగిన చలితో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సైతం సలహా ఇస్తున్నారు. రాష్ట్రంలో బాగా పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రత నమోదయింది. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఒక్కసారి చలి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో అత్యల్పంగా తిర్యాని మండలం గిన్నెదరి, సిర్పూర్ (యు) లో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, తిర్యాని లో 7.9 డిగ్రీల, కెరమెరి లో 9.3 డిగ్రీలు, దనోరా 9.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయింది. మెదక్ జిల్లాలో చలి విజృంభిస్తుంది. మెదక్ జిల్లా టేక్మాల్ లో 9.3 డిగ్రీల ఉష్ణోగ్రత, నర్సాపూర్ లో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో గురువారం అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా సంగారెడ్డి కోహీర్ లో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత, సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, జిల్లాలోని న్యాల్ కల్ 7.7, ఆంధోల్ 7.6, కోహీర్ 6.9 సెంటిగ్రేడ్ ల ఉష్ణోగ్రత నమోదయింది. చలి తీవ్రతతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మంచు కురుస్తుంది. దీంతో జాతీయ రహదారులు 65,121 రహదారులపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . దట్టమైన పొగమంచుతో ప్రయాణాలు చేసేవారు భయపడుతున్నారు. ఇక సాయంత్రం 5 గంటల నుండే చలి గాలులు మొదలవుతున్నాయి. వాతావరణ నిపుణులు రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# బీసీలపై కవితది కపట ప్రేమ

- చిత్తశుద్ధి ఉంటే బీసీలకు బీఆర్ఎస్ పదవులు ఇవ్వాలి
- కవితకు మంత్రి పొన్నం స్ట్రాంగ్ కౌంటర్
- కులగణన రిపోర్టును పబ్లిక్ డొమైన్ లో పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీసీల అభ్యున్నతి కోసం నిజంగా ఆర్ఎస్ కు చిత్తశుద్ధి ఉంటే ముందు పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలని కవితకు చురకలు అంటించారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఎన్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసం ఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని, సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రకటించామన్నారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవరెంతో వారికి అంత అని రాహుల్ గాంధీ చెప్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీసీలను ఉపయోగించుకుంటే ఊరుకోమని మంత్రి పొన్నం హెచ్చరించారు.





# అధికారులను బకరా చేసిన కేటీఆర్

## ఆస్తులపై చర్చకు రా తేల్చుకుందాం

### మాజీ మంత్రి కేటీఆర్ కు షబ్బీర్ అలీ సవాల్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేతలకు సిగ్గూ, శరం ఏమీ లేదని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఘాటుగా విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్ అవినీతిపై ఓపెన్ చాలెంజ్ చేశారు. ఉద్యమంలో కూడా కేటీఆర్ ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. గాంధీభవన్‌లో షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్ అస్తులు పెరగడానికి కారణమైన అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని ప్రజలకు చూపెట్టాలన్నారు. ఎన్నికల కోసం మేం ఆస్తులు అమ్ముతున్నామని, అలాంటిది కేసీఆర్ కుటుంబం ఆస్తులు ఎలా పెరుగుతున్నాయని ప్రశ్నించారు. కేటీఆర్ ఐఏఎస్ అఫీసర్లను బకరాలను చేశారని మండిపడ్డారు. 2008లో రూ. 4.32 కోట్ల అఫిడవిట్ చూపించిన కేటీఆర్ 2009లో రూ. 7.99 కోట్లు చూపించారని, ఇన్ని ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీశారు. 2023లో రూ. 50 కోట్లకు పైగా కేటీఆర్ ఆస్తులు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కవితల ఆస్తులు కూడా భారీగా పెరిగాయని ఆరోపించారు. అవినీతి జరిగిందని దర్యాప్తు సంస్థలు తేల్చితే కక్ష సాధింపు చర్యలంటూ కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా ఆస్తులను సంపాదించి ఇప్పుడు దొంగ ఏడుపులు ఎందుకని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేసులో తప్పు జరిగిందని, ఆ తప్పుకు నేనే బాధ్యత అని బహిరంగంగా ఒప్పుకున్న కేటీఆర్ ఈడీ, ఏసీబీలు రంగంలోకి దిగగానే తప్పే చేయలేదని, అవినీతే జరగలేదని మాట మార్చడం దారుణమన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్ తప్పుల మీద తప్పులు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్ళు పాలించమని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, ప్రజల తీర్పును కూడా లెక్క చేయకుండా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజల నుంచి పార్టీకి, ప్రభుత్వానికి వస్తున్న ఆధరణ కనిపించడం లేదన్నారు. తన వరకు వస్తే కానీ బీఆర్ఎస్ నేతలకు తెలియడం లేదని, అధికారంలో ఉన్న 10 ఏళ్ళు ప్రజలను రాచి రంపాన పెట్టారన్నారు. గతంలో పార్లమెంటు జరిగే సమయంలో రేవంత్ రెడ్డిని అరెస్టు చేసేటప్పుడు రూల్స్ గుర్తుకు రాలేదా అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

#### లిక్కర్ రాణి కవిత

లిక్కర్ రాణిమ్మ కవిత ఇచ్చిన లిక్కర్ సప్లై పర్మిషన్లతోనే రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరుగుతుందన్నారు. తెలంగాణలో అయ్య సంపాదించిన ఆస్తులు సరిపోవడం లేదని కవిత ఢిల్లీకి వెళ్ళి అక్రమ లిక్కర్ వ్యాపారానికి తెరలేపడంతోనే అరెస్టయ్యారన్నారు. అవన్నీ ఐరిచి ఇప్పుడేదో రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరుగుతుందని మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. లిక్కర్ స్కాంలో కవితపై పూర్తి ఆధారాలను సేకరించిన తర్వాతే ఈడీ, సీబీఐలు అరెస్టు చేశారని, ఇప్పుడు కేటీఆర్ కు అదే పరిస్థితి ఎదురవడం ఖాయమన్నారు.

# ఫార్ములా ఈ-కార్ కేసు

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు.. ఈనెల 6న విచారణకు రావాలని ఆదేశం



(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే ఈడీ ఈనెల 7న విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఏసీబీ ఇప్పటి వరకు కేసు ఫిర్యాదుదారు అయిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అయిన దానకిశోర్ నుంచి సమాచారం సేకరించింది. వాటి ఆధారంగా ఈ కేసులో నిందితులకు నోటీసులు జారీ చేస్తోంది. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఏ1గా, అప్పటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏ3గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. అందులో భాగంగానే విచారణ కోసం కేటీఆర్‌కు తాజాగా నోటీసులు జారీచేసింది. మరోవైపు ఈ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ ఇప్పటికే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై గతనెల 31న విచారణ జరిపిన హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీచేసింది. అయితే దర్యాప్తు జరుపుకునేందుకు అనుమతి ఇచ్చింది.

గత విచారణలో కేటీఆర్ పిటిషన్‌పై ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. ఫార్ములా ఈకార్ రేసింగ్ ఒప్పందం కోసం సరైన అనుమతులు లేకుండానే రూ.54 కోట్లు చెల్లించాలని ఏసీబీ పేర్కొంది. అందులోనూ రూ. 46 కోట్లను బ్రిటీష్ పౌండ్ల రూపంలో చెల్లించారని ఇందుకు ఆర్బీఐ నిబంధనలు పాటించలేదని కూడా ఏసీబీ న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చింది. విచారణ అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచి అప్పటి వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని సూచించింది. మరోవైపు ఈ కేసులో విదేశీ చెల్లింపుల వ్యవహారం కూడా ముడిపడి ఉండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగింది. కేసులో ముగ్గురు నిందితులైన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులు జారీచేసింది. అయితే నిన్న ఈడీ ముందుకు రావల్సిన బీఎల్ఎన్ రెడ్డి ఈనెల 8న వస్తానని తెలిపారు. అరవింద్ కుమార్ సమయం కావాలని కోరారు. కేటీఆర్ ఏడవ తేదీన ఈడీ ఎదుట హాజరవాల్సి ఉన్న తరుణంలో ఏసీబీ నోటీసులు అందడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రైతులు మళ్లీ ఎందుకు ప్రమాణ పత్రాలు ఇవ్వాలి..?

## సర్కారుపై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్:** ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు కాకుండా.. రైతులు మళ్లీ కొత్తగా ఎందుకు ప్రమాణ పత్రాలు ఇవ్వాలి..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. రైతులు కాదు ప్రమాణపత్రాలు ఇవ్వాల్సింది.. రేవంత్ రెడ్డి ఇవ్వాలి అని కేటీఆర్ సూచించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హామీలు ఇచ్చారు. ఎన్నికలప్పుడేమో కాంగ్రెస్ నేతలు బాండ్ పేపర్లు రాసిచ్చారు.. ఇప్పుడేమో రైతులు ఊర్లలో ప్రమాణపత్రం ఇవ్వాలట. ఇంతకంటే విచిత్రమైన ముచ్చట వినలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ప్రజాపాలన అని కింద అన్ని వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల కోసం కోటి 6 లక్షల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. మరి ఈ సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండాలి కదా..? ఇప్పుడేందుకు కొత్తగా రైతులను ప్రమాణపత్రాలు అడుగుతున్నారని కేటీఆర్ అడిగారు.

### దిక్కుమాలిన విధానాలు

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన అన్నారు.. మొన్నటి దాకా కుల గణన, ఇప్పుడ మళ్లా కొత్తగా ప్రమాణ పత్రం ఇవ్వాలని అంటున్నారు. ప్రమాణపత్రం ఇస్తేనే రైతుభరోసా పైసలు ఇస్తాం అంటున్నారు. రైతును శాసించే స్థాయికి కేసీఆర్ తీసుకొచ్చారు. వీళ్లేమో రైతును యాచించే స్థాయికి తీసుకెళ్తున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సన్నాసులు.. అఫిడవిట్లు దేవుండ్ల వద్ద పెట్టారు.. మేం రాగానే అమలు చేస్తామని డిక్లరేషన్ల పేరిట బిల్డప్‌లు ఇచ్చారు. కానీ ఇప్పుడు దిక్కుమాలిన విధానాలు తీసుకొస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజా పాలనలో దరఖాస్తు ఇచ్చాం కదా.. మళ్లీ ప్రమాణ పత్రం ఎందుకు అని నిలదీయండి. 70 లక్షల ఖాతాలు నీ దగ్గర ఉన్నాయి.. పొలం వివరాలు అన్నీ తెలుసు.. తెలిసీ కూడా ఈ ప్రయత్నం చేస్తున్నావంటే కటింగ్ పెట్టుందకు ప్లాన్ చేస్తున్నవ్.. కాబట్టి రైతులు ఊరురా నిలదీయాలి ప్రభుత్వాన్ని అని కేటీఆర్ సూచించారు.





# పదేళ్లు బీసీలను అణగదొక్కి ఇపుడు డ్రామాలా?

## కవితపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు మహేష్‌కుమార్‌గౌడ్ కౌంటర్ ఇచ్చారు. బీసీల గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదని, పదేళ్లు బీసీలను అణగదొక్కి అగ్రవర్ణాలకే అంకితమైన పార్టీ బిఆర్ఎస్ కాదా అని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ నేతల మాటలను ప్రజలు నమ్మరని మహేష్‌గౌడ్ అన్నారు. బీసీలకు కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తనలాంటి సామాన్య కార్యకర్తకు టీపీసీసీ ఇవ్వడంతో పాటు బీసీల డిపార్ట్‌మెంట్‌కు అత్యధిక నిధులు ఇచ్చిందని మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ను ప్రతిపాదించింది తానేనని, అందుకు అనుగుణంగానే బీసీ డెడికేషన్ కమిషన్ ను వేసి కుల సర్వే చేపడుతున్నామన్నారు. బిసిలకు రిజర్వేషన్లు తగ్గించింది ఎవరు? కేబినెట్ లో బిసిలకు అన్యాయం చేసింది ఎవరు? ముందు కవిత వెళ్ళి వాళ్ళ తండ్రి చేసిన అన్యాయాలపై నిలదీయాలన్నారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే మమ్ముల్ని ప్రజలు నమ్ముతారా, ప్రజలు మిమ్ముల్ని నమ్ముతారా? అవగాహన లేకుండా కవిత రాజకీయాలు చేస్తున్నారన్నారు.

**జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్లాన్ చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లాల్లో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లో పార్టీ నేతలతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేయనున్నారు.

## తెలంగాణ మణిహారం

# రీజినల్ రింగ్ రోడ్

## భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయండి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

### ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రాలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలి



(మొదటిపేజీ తరువాయి)

వెంటనే పరిష్కరించాలని, ఇందుకోసం అటవీ ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమించుకోవాలని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో రీజినల్ రింగ్‌రోడ్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి గారు సమీక్షించారు. నాగ్‌పూర్‌విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రతీ గ్రామంలో బిటిరోడ్లు**

రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రాలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాల్సిందేనని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వీలైనంత వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి , కొండా సురేఖ , ధనసరి సీతక్క , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి , పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తోడేళ్ళ గుంపు లాంటిది

- భక్షించడమే తప్ప రక్షించడం తెలియదు
- తోడేలు గొర్రెల మందకు కాపలా కాస్త అంటే ఎలా
- బీసీల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కవిత ప్రయత్నాలు
- మీడియా ప్రతినిధులతో మంత్రి సీతక్క



**హైదరాబాద్, మహా:** ఇందిరా పార్కులో బీసీ మహా సభలో కాంగ్రెస్ పై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క తప్పుపట్టారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల పట్ల అహంకారంతో వ్యవహరించి.. ఇప్పుడు మమకారం కురిపిస్తే బీసీలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీసీల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కవిత ప్రయత్నిస్తున్నారని, తోడేలు గొర్రెల మందకు కాపలా కాస్త అంటే ఎలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తోడేళ్ళ గుంపు లాంటిదని.. భక్షించడమే తప్ప రక్షించడం తెలియదన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు కవితకు బీసీ లు గుర్తుకురాలేదని, కేంద్రంలో, రాష్ట్రంలో విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నడు లేని విధంగా సమగ్ర కుల గణన చేపట్టిందని, బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు న్యాయ నిపుణులతో, మేధావులతో చర్చిస్తున్నామన్నారు. బీసీ ముసుగుతో కవిత మరో రాజకీయ డ్రామా మొదలుపెట్టారని, అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్.. బీసీ మంత్రులకు కనీసం అపాయింట్మెంట్ ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో సామాన్యులు ముఖ్యమంత్రి సైతం సునాయాసంగా కలవగలుగుతున్నారన్నారు. బీసీలను అడుగడుగునా మోసం చేసిన టిఆర్ఎస్, బీసీ రాగాన్ని ఎత్తుకున్నంత మాత్రాన బీసీలు నమ్మరన్నారు.



EDITORIAL
ఎడిటోరియల్





# చైనాలో మరో కొత్త వైరస్ విజృంభణ

## దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ?.. న్యుమోనియా తరహా వైరస్.. కొవిడ్ తీవ్రత

**మహా:** కరోనా మహమ్మారికి పుట్టిల్లు చైనాలో మరో వైరస్ వ్యాప్తి కలకలం రేపుతోంది. సరిగ్గా కోవిడ్ 19 వెలుగులోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత కొత్తరకం వైరస్ పుట్టుకురావడం ఆందోళనకు గురిచేస్తోంది. చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, దీని బారినపడి ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. హెచ్ఎంపీవీతోపాటు ఇన్ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా నిమోనియా, కోవిడ్ 19 వైరస్‌లు కూడా విజృంభిస్తున్నట్టు వీడియోలను షేర్ చేస్తున్నారు. అంతేకాదు, దేశవ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించినట్లు కొంతమంది నెటిజన్లు పేర్కొంటున్నప్పటికీ.. దీనిని అధికారికంగా ధ్రువీకరించలేదు. హ్యూమన్ మోటానిమోవైరస్ బారినపడ్డవారిలో కోవిడ్ తరహా లక్షణాలే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ వైరస్ వ్యాప్తిని చైనా ఆరోగ్యశాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ‘‘ఇన్ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా నిమోనియా, కోవిడ్ 19 సహా పలు వైరస్‌లు చైనాలో వేగంగా వ్యాప్తిచెందుతున్నాయి..దీంతో బాధితులతో ఆసుపత్రులు, చనిపోయినవారితో శ్మశానాలు నిండిపోతున్నాయి.. పిల్లల ఆసుపత్రులు ముఖ్యంగా పెరుగుతున్న న్యుమోనియా, వైట్ లంగ్ కేసులతో ఒత్తిడికి గురవుతున్నాయి’ అని ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. కాగా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చేలా రాయిటర్స్ వార్తా సంస్థ నివేదిక విడుదల చేసింది. శీతాకాలంలో కొన్ని శ్వాసకోశ వ్యాధులు పెరగడంతో గుర్తు తెలియని న్యుమోనియా తరహా ఓ వైరస్ మూలాలను కనుగొనేందుకు చైనా డిసీజ్ కంట్రోల్ అథారిటీ ఓ పర్యవేక్షక వ్యవస్థను ప్రారంభించినట్టు అందులో పేర్కొంది. ఐదేళ్ల కిందట 2019 డిసెంబరులో కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేలా తొలినాళ్లలో చైనా సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రపంచం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని డ్రాగన్ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వైరస్ కారకాలను గుర్తించడం, నిరంతరం అధికార యంత్రాంగానికి అవసరమైన సూచనల కోసం ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ మేరకు చైనా అధికార మీడియా ‘సీసీటీవీ’ వెల్లడించింది. దీని ప్రకారం.. డిసెంబరు 16 నుంచి 22 వరకు వారం వ్యవధిలోనే అంటువ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. వ్యాధి నియంత్రణ, నివారణ, కేసులను నిర్ధారణ, వాటి నిర్వహిణకు నేషనల్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అడ్మినిస్ట్రేషన్ యంత్రాంగం ఒక విధానాన్ని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది. అయితే, శీతాకాలం, వసంతకాలంలో చైనాలో పలు శ్వాసకోశ ఇన్ఫెక్షన్ వ్యాధులు విజృంభిస్తాయని కన్ బియో అనే ఓ అధికారి అన్నారు. గతేడాదితో పోల్చితే ఇవి చాలా తక్కువని అన్న ఆయన.. సంఖ్యను మాత్రం బయటపెట్టలేదు. అయితే, ఇటీవల బయటపడిన కేసులలో రైనోవైరస్, హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ వంటి వ్యాధికారక కారకాలు ఉన్నాయి. మెటాప్న్యూమోవైరస్ కేసులు 14 ఏళ్లలోపు పిల్లల్లో ముఖ్యంగా ఉత్తర ప్రావిన్సులలో పెరుగుతున్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. మెటాప్న్యూమోవైరస్ చికిత్సలో యాంటీవైరల్ డ్రగ్స్ గుడ్డిగా వినియోగించవద్దని ఇటీవల షాంఘై ఆసుపత్రి శ్వాసకోశ వ్యాధి నిపుణుడు హెచ్చరించారు.
జలుబు మాదిరి లక్షణాలు ఉండే ఈ వైరస్‌కు ఇప్పటి వరకూ ఎలాంటి వ్యాక్సిన్ లేదు.




# మళ్లీ భయం భయం

## దడ పుట్టిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి!

మానవ జీవనాన్ని అతలాకుతలం చేస్తున్న వింత వ్యాధులు

**తమిళనాడులో వెలుగులోకి వచ్చిన కొత్త వ్యాధి..**

జిల్లాలకు వేగంగా వ్యాప్తి.. అప్రమత్తమైన వైద్యశాఖ

నివారణ చర్యలకు ఉపక్రమణ..
జాగ్రత్తలు తీసుకోవాలంటూ ముమ్మర ప్రచారం

**చెన్నై, మహా :** కోవిడ్ తర్వాత ప్రపంచంలో ఏదో మూల ఏదో తెలియని అలికిడి. నిత్యం భయం.. భయంగా గడపాల్సి వస్తుంది. కొత్త కొత్త వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. జనాలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజగా తమిళనాడులో మరో కొత్త మహమ్మారి పుట్టుకొచ్చింది. స్క్రబ్ టైఫస్ కేసులు తమిళనాడులో నానాటికీ పెరిగిపోతున్నాయి. చెన్నై, కాంచీపురం, తిరుపత్తూరు, తిరువళ్లూరు, చెంగల్పట్టు, రాణిపేట్, వెల్లూరు జిల్లాల్లో అధికంగా కేసులు నమోదవుతున్నాయి. వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ ఆయా జిల్లా అధికారులకు సూచనను జారీ చేసింది. స్క్రబ్ టైఫస్ అనేది.. ఓరియంటియా సుత్సుగముషి జాతికి చెందిన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్. స్క్రబ్ టైఫస్ కీటకాల కాటు ద్వారా వ్యాపిస్తుంది. వీటిని చిగ్గర్స్ అని పిలుస్తారు. ఈ కీటకాలు సాధారణంగా పొదలు, అటవీ ప్రాంతాల్లో కనిపిస్తాయి. ఈ వ్యాధి పిల్లలు, పెద్దలు ఎవరికైనా సోకే అవకాశం ఉంది. స్క్రబ్ టైఫస్ సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, అలసట, ఒంటిపై దుద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రమైతే స్క్రబ్ టైఫస్ న్యుమోనైటిస్, మెనింజైటిస్, గుండె వైఫల్యం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్ని సందర్భాల్లో అవయవ వైఫల్యానికి కూడా కారణమవుతుంది.

### స్క్రబ్ టైఫస్ వ్యాప్తి నివారణ ఎలా?

స్క్రబ్ టైఫస్ కేసులకు సత్వర చికిత్స అందేలా చూడాలని చెన్నై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సెల్వవినాయకం అధికారులను ఆదేశించారు. ఎలిసా రక్త పరీక్షలు, మాలిక్యులర్ టెస్టుల ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చని పేర్కొన్నారు. చికిత్సలో సాధారణంగా అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ వినియోగిస్తారు. వ్యాధి తీవ్రమైతే ఆసుపత్రిలో చేరి, అడ్వాన్స్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. వ్యాధి సోకకుండా జాగ్రత్తగా ఉండాలని, చెన్నైలోని ఆయా జిల్లాల ప్రజలకు అక్కడి ఆరోగ్య శాఖ హెచ్చరించింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999


## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు



**ఆదిలాబాద్, మహా:** సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు సావిత్రి బాయి పూలే అహర్నిశలు కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ అన్నారు. శుక్రవారం అదనపు డైరెక్టర్ శ్రీధర్, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగారని, ఆమె జీవితాన్ని మహిళోద్ధరణ కోసమే అంకితం చేశారని కొనియాడారు. మహిళలు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.
అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో మహనీయులు భవిష్యత్తు తరాల నిమిత్తం ఎన్నో ఒడి దుడుకులను తట్టుకొని, తమ జీవితాలను త్యాగం చేసి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. సావిత్రిబాయి పూలే సాంఘిక దురాచారాలను అరికడుతూనే.. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. మహిళలకు విద్య ద్వారానే సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని గ్రహించ గలుగుతారనే సదుద్దేశంతో 1848 సంవత్సరంలోనే మొట్ట మొదటి మహిళా పాఠశాలను నెలకొల్పి మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా కీర్తిని పొందిన సావిత్రిబాయి పూలే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని, సమాజంలో ఎలాంటి వివక్షకు తావునీయకుండా తమ హక్కుల కోసం పోరాటం చేయాలని సూచించిన సావిత్రిబాయి పూలే కలలను నెరవేర్చవలసిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఆపద సమయంలో ఆపద్బంధువు ఇంటర్ సెప్టర్

### జిల్లా ఎస్పీ గౌష్ ఆలం



**ఆదిలాబాద్, మహా:** అత్యవసర సమయాలలో స్పందించేందుకు, అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు నూతనంగా ఇంటర్ సెప్టర్ అందుబాటులోకి వచ్చిందని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. స్థానిక ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నూతన ఇంటర్ సెప్టర్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో జరిగే నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఆరుగురు సిబ్బందితో ప్రత్యేక ఇంటర్ సెప్టెర్ వాహనాన్ని ఉపయోగించనున్నట్లు ఎస్పీ తెలిపారు. వాహనంలో ఉన్న సిబ్బంది ద్వారా ప్రమాదాలు నివారించేందుకు, ఎక్కువగా ప్రమాదాలు సంభవించే హాట్ స్పాట్ ల వద్ద తగు నియంత్రణ చర్యలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాణనష్టం జరగకుండా ముఖ్యమైన బ్లాక్ స్పాట్ వద్ద సిబ్బందిని కేటాయించి తగు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ముఖ్యమైన ప్రదేశాలు, జాతరలు, సమావేశాలు, సభలు, ప్రజలు గుమిగూడి ఉండే కార్యక్రమాల వద్ద ఎలాంటి నష్టం కలగకుండా పక్కా ప్రణాళికతో విధులను నిర్వర్తిస్తారని వివరించారు. అత్యవసర సమయాలలో, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సందర్భాలలో అల్లరి మూకలపై అత్యవసరంగా స్పందించి నివారణ చర్యలను చేపడతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సునీల్, కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఇంటర్ సెప్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

- జూలై 15 లోగా మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావలసిందే
- రిటైనింగ్ వాల్ భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఏడు రోజులలో నివేదిక అందించాలి
- రెవెన్యూ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం , జనవరి 03, మహా.**



దశాబ్దాల నుండి ఖమ్మం పాలేరు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న మున్నేరు వాగు ముప్పు సమస్యకు మరో ఏడు నెలల్లోగా శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్నేరు నది ఒడ్డున ముంపునకు గురవుతున్న నివాస కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపుతూ నదీ తీరం వెంబడి రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్సిసి రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జూలై 15 వ తేదీలోగా ఎట్టి పరిస్థితులలోనూ పనులను పూర్తి చేసి తీరాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రివర్యులు, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూ సేకరణ పై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి 234 ఎకరాల భూమి అవసరం ఉండగా 64 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండగా 170 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయని వెంటనే ఈ భూములను సేకరించడానికి యజమానులతో మాట్లాడి యుద్ధ ప్రతిపాదికన భూ సేకరణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో మున్నేరు వాగు పొంగి పొర్లడం వల్ల ఖమ్మం, పాలేరు నియోజకవర్గం ప్రజలు తరచూ వరద సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇటువంటి పరిస్థితిని నియంత్రించడానికి రిటర్నింగ్ వాల్ నిర్మాణం ఒకటే పరిష్కారం అని అన్నారు. రిటైనింగ్ వాల్ డిజైన్ చేసే సమయంలో చెక్ డ్యాం ప్రవాహం పరిగణలోకి తీసుకున్నారా, నగరంలోని క్యాచ్ మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద అంచనా ఎంత వంటి వివరాలను ఈ సందర్భంగా మంత్రి గారు ఆరా తీశారు. ప్రతి నెల రెండు రోజులు ఈ పనులను తనిఖీ చేయడం జరుగుతుందని, ప్రతి రోజూ ఎంత మేరకు పని జరగాలో ప్రణాళిక తయారు చేసుకోవాలని, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఫీల్డ్ లెవల్లో ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు పనుల పురోగతి వివరాలు వాట్సాప్ లో అప్ డేట్ చేయాలని అన్నారు.

మున్నేరు నది ఎఫ్.ఎస్.టి. వివరాలు తెలుసుకున్న మంత్రి, గత సెప్టెంబర్ లో వచ్చిన విధంగా భారీ వరదలు వస్తే ఎంత మేరకు నీరు చేరుతుంది, అధికంగా ఫోర్స్ తో నీటి ప్రవాహం వచ్చినప్పుడు తట్టుకునేందుకు రిటైనింగ్ వాల్ లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ఎంజాయ్ మెంట్ సర్వే రెండు రోజులలో పూర్తి చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ కు తెలిపారు. ఎస్.ఎస్.పి. సంబంధించిన భూములు, ఖమ్మం అర్బన్ లోని భూములు ఎంత సేకరించాలి, దానికి నిర్దేశించుకున్న ప్రణాళిక ఇటువంటి పూర్తి వివరాలు నివేదికలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మున్నేరు నది బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల వివరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో ప్రభుత్వ భూములలో జరిగిన ఆక్రమణలకు సంబంధించి వారం రోజులలో పూర్తి నివేదిక అందించాలని రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు.

భూ సేకరణ కోసం సంబంధిత రైతులతో సంప్రదింపులు జరిపేందుకు నిపుణుల కమిటీ నియమించుకోవాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చేలా చూడాలని అన్నారు. ఎంజాయ్ మెంట్ సర్వేలో ప్రభుత్వ భూములు ప్రైవేటు భూములుగా క్రింది స్థాయి సిబ్బంది ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడ ఎటువంటి అవకతవకలకు పాల్పడడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో మున్నేరు నది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, నిధులపై ప్రణాళిక తయారు చేశామని అన్నారు. గతంలో ఎన్నడు మున్నేరు నది వద్ద లక్షా 70 వేల క్యూసెక్కుల మించి వరద రాలేదని, సెప్టెంబర్ 2024 లో మాత్రం 3 లక్షల 12 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని 3 లక్షల 50వేల క్యూసెక్కుల ప్రవాహం సామర్థ్యం, 15 మీటర్ల ఎత్తు , 6 మీటర్ల వెడల్పుతో రూరల్, అర్బన్ ప్రాంతంలో 8.5 కిలోమీటర్ల చొప్పున 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ కొరకు శాస్త్రీయంగా తయారు చేశామని అన్నారు. రిటైనింగ్ వాల్ సంబంధించి 234 ఎకరాల 20 గుంటల భూసేకరణలో ప్రభుత్వ భూమి 60 ఎకరాలు 31 గుంటలు ఉందని, ప్రైవేట్ భూముల 173 ఎకరాల 29 గుంటల భూమి ఉందని, 28 నిర్మాణాలు తొలగించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రిబాయి జయంతి వేడుకలు

**ఇబ్రహీంపట్నం, జనవరి 3, మహా:** అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా, బహుజన సమాజ్ పార్టీ, అసెంబ్లీ అధ్యక్షులు వంగాల కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పల్లాటి రాములు హాజరై మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో చదువు నేర్చుకునే సమయంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని, స్థిరమైన ఆలోచనతో మహిళలు సమాజంలో చదువుకొని గౌరవంతో ఉండాలనే ఆలోచనతో మహాత్మ జ్యోతిరావు పూలే సహకారంతో దేశంలో అనేక పాఠశాలలను స్థాపించి, బహుజనుల బ్రతుకుల్లో వెలుగులు నింపిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. భారతదేశంలోని ప్రతి మహిళ గుండెలో నిలిచిపోయిన గొప్ప వ్యక్తి ఆమె అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఉపాధ్యక్షులు గుండె శ్రీనివాస్, కోశాధికారి బంగరిగల్లా మహేందర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు మంద రాజు, ఉపాధ్యక్షులు చెరుకూరి కరుణాకర్, మంచాల మండల అధ్యక్షులు నల్ల శివకుమార్, సీనియర్ నాయకులు మేతరి కుమార్, మేడిపల్లి మహేష్, ఆరుట్ల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## నాగోబా జాతర ప్రచారం ప్రారంభం



**ఆదిలాబాద్, మహా:** దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన వేడుకైన కేస్లాపూర్ నాగోబా జాతరకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 28న ఆలయంలో మహాపూజతో జాతర ప్రారంభం అవుతుందని, 31న గిరిజన దర్బార్ ఉంటుందని సమాచారం. గురువారం రాత్రి నెలవంక కనిపించడంతో జాతర ఉత్సవాలలో తొలిఘట్టమైన ప్రచార రథం ఊరేగింపు మొదలైంది. ఉమ్మడి జిల్లాలోని మెస్రం వంశీయులు కేస్లాపూర్లో నాగోబా మురాడి వద్ద పీఠాధిపతి మెస్రం వెంకట రావు నేతృత్వంలో సమావేశమై, ప్రచారయాత్ర, గంగాజలయాత్ర, మహాపూజ, జాతర నిర్వహణ విషయమై చర్చించారు. ప్రత్యేక పూజల అనంతరం రథాన్ని ప్రారంభించారు. గ్రామపొలిమేర వరకు మెస్రం వంశంలోని అల్లుడు కచ్చలం నడపగా అక్కడి నుంచి ఆలయ కటోడాల ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగించారు. ముందుగా ఆనవాయితీగా సిరికొండ మండల కేంద్రంలోని కుమ్మరి వద్ద మహాపూజకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డరిచ్చారు. ఏడు రోజుల పాటు ఈ ప్రచార రథం సిరికొండ , రాజంపేట్ ,కొలాడి , సోయం గూడ, గిన్నెర, సాలెవాడ, వడగావ్ గ్రామాలలో జాతర కార్యక్రమాల గురించి ప్రచారం చేపట్టి తిరిగి ఈనెల 9వ తేదీన కేస్లాపూర్ కు చేరుకుంటుంది. ఈ నెల 10 వ తేదీన గంగా జలం కోసం హస్తిన మడుగుకు కాలినడకన ప్రయాణం అవుతారు.

## మహిళలకు చదువు నేర్పిన గొప్ప మాతృమూర్తి



**ఇబ్రహీంపట్నం, జనవరి 3, మహా:** సావిత్రిబాయి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలంటూ ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుమలత, విజయ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు చదువు కోసం ఎంతో కృషి చేసి, మహిళలందరికీ చదువు నేర్పిన గొప్ప నాయకురాలు, మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సమాజంలో గొప్ప మార్పులకు సావిత్రిబాయి పూలే పునాదులు వేశారని అన్నారు. మహిళ విద్య కోసం ప్రాధాన్యతనిచ్చారన్నారు. చిన్నతనం నుండే ఎన్నో అవమానాలు పడుతూ తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలసి సమాజంలో జరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా ఎన్నో రకాల ఉద్యమాలు నిర్వహించిన గొప్ప సంస్కర్తలు సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు అరుణ, సంధ్య, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష కార్యదర్శులు ఇందిరా మున్ని పాల్గొన్నారు.

## భైంసా ఆలయంలో చోరీ



**నిర్మల్, మహా:** జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. నాగదేవత ఆలయంలో చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసులకు మళ్లీ మరో సవాల్ ఎదురైంది. భైంసా పట్టణంలోని పూలేనగర్ హనుమాన్ ఆలయంలో దొంగతనం జరిగింది. రాత్రి వేళల్లో గుర్తుతెలియని దుండగులు హుండీ తాళంతోపాటు వాచ్‌మెన్ గది తాళాన్ని పగలగొట్టి నగదును చోరీ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## పాస్ పోర్ట్ సమస్యలకు తక్షణ పరిష్కారం

### సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి(ఆర్పీవో) జొన్నలగడ్డ స్నేహజ

### పాస్‌పోర్టులకు పెరిగిన డిమాండ్.. 2024లో 9 లక్షల అప్లికేషన్‌లు ప్రాసెస్



**హైదరాబాద్, మహా:** పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా తక్షణమే పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి(ఆర్పీవో) జొన్నలగడ్డ స్నేహజ వెల్లడించారు. పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీలో కానీ ఏవైనా తప్పులు దొర్లినట్లయితే ప్రతి గురువారం ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక కౌంటర్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

**పాస్‌పోర్టులకు డిమాండ్ ఫుల్**

కొవిడ్ సమయంలో పాస్‌పోర్టులకు కొంత డిమాండ్ తగ్గినప్పటికీ ఆ తర్వాత క్రమంగా పెరుగుతోందని స్నేహజ పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, పర్యాటక ఇలా రకరకాల అవసరాల కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరుగుతోందని వివరించారు. 2024లో పాస్‌పోర్ట్, గ్లోబల్ ఎంట్రీ, పీసీసీ అప్లికేషన్లు ఇలా 9 లక్షల అప్లికేషన్‌లు ప్రాసెస్ చేశామన్నారు. డిమాండ్‌ను అధిగమించేందుకు మొబైల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలను కూడా పెంచుతామని వెల్లడించారు. ఇప్పుడున్నటువంటి ఆరేడు రోజుల అపాయింట్‌మెంట్ నిడివిని మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు.

**5 పాస్‌పోర్ట్ సేవాకేంద్రాల ద్వారా సేవలు**

రాష్ట్రంలో 5 పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు ఉన్నాయని స్నేహజ తెలిపారు. 14 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఒక మొబైల్ వ్యాన్‌ను కామారెడ్డి పోస్టాఫీసు పాస్‌పోర్ట్ సేవాకేంద్రంలో ఉంచామన్నారు. పాస్‌పోర్టులో ఏవైనా మార్పు చేర్పులు చేయాల్సి ఉంటే పాస్‌పోర్ట్ అప్లికేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

**7.50 లక్షల పాస్‌పోర్టులు జారీ చేశాం**

2024లో 7.50లక్షల పాస్‌పోర్టులు జారీ చేసినట్లుగా స్నేహజ వివరించారు. అపాయింట్‌మెంట్ సైకిల్ 6 నుంచి 8 రోజుల్లో దొరుకుతుందని వివరించారు. డిమాండ్‌కు తగ్గట్లుగా అపాయింట్‌మెంట్‌లను పెంచుతున్నట్లుగా తెలిపారు. ప్రతి గురువారం 9.30 నుంచి 12.30 వరకు పాస్‌పోర్టుకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా వారు అపాంట్‌మెంట్ తీసుకోకుండానే పాస్‌పోర్టు అఫీస్‌ను సంప్రదించవచ్చని స్నేహజ తెలిపారు. పాస్‌పోర్టులకు సంబంధించి అధిక సమస్యలను ఈ విధంగానే పరిష్కరిస్తున్నట్లుగా ఆర్‌పీవో స్నేహజ వివరించారు.

## బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మంత్రి శ్రీధర్ బాబు

### క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళిక : మంత్రి శ్రీధర్ బాబు

### క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ సంకల్పం

**హైదరాబాద్:** తమ ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మంత్రి శ్రీధర్ బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబును భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బ్యాడ్మింటన్‌ను ప్రోత్సహించాలని పుల్లెల గోపీచంద్ అకాడమీ ఏర్పాటు చేశారని చెప్పారు. అనేకమంది క్రీడాకారులను తయారు చేసిన ఘనత గోపీచంద్ అకాడమీది అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంకల్పించారని చెప్పారు. గ్రామీణ ప్రతిభను వెలికి తీయడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. బ్యాడ్మింటన్ ప్రోత్సాహానికి కూడా తాము ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 3వ తేదీనుంచి 10వ తేదీవరకు ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ జరుగుతుందని వివరించారు. గచ్చిబౌలి స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరుగుగుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై వినతులు స్వీకరించిన ఏకసభ్య కమిషన్



**ఆదిలాబాద్, మహా:** ఎస్సీ వర్గీకరణపై తమ అభిప్రాయాలను ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా దరఖాస్తులో తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ అన్నారు. కమిషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి కలెక్టరేట్ లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ ప్రారంభించి వినతులను స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులన్ని స్టడీ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, షెడ్యూల్డు కుల సంఘాల నాయకులు, ఎస్సీ కులానికి చెందిన వివిధ వర్గాల వారి నుండి వినతులు స్వీకరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని, ఎస్సీ వర్గీకరణ వద్దు.. రాజ్యాంగం ముద్దు అంటూ మాలలు ఏకసభ్య కమిషన్ చైర్మన్ కు విన్నవించారు. ఎస్సీలలో అందరూ వెనుకబాటుకు గురై ఉన్నారని, వర్గీకరణ చేయకూడదని పేర్కొంటూ దరఖాస్తులను అందజేశారు. లేదంటే అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పెద్దమొత్తంలో ఉద్యమించి రాజకీయ నాయకుల భవిష్యత్తును తలకిందులు చేస్తామని హెచ్చరించారు. అటు ఎస్సీ వర్గీకరణతోనే తమకు న్యాయం జరుగుతోందని, దశాబ్దాలుగా ఇందుకోసమే తమ జాతి పోరాటం సాగుతోందని మాదిగలు నినదిస్తూ భారీ సంఖ్యలో వినతిపత్రాలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అంతకుముందు గురువారం రాత్రే జిల్లా కేంద్రానికి విచ్చేసిన చైర్మన్ కు స్థానిక పెన్ గంగా అతిథి గృహం వద్ద కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పూల మొక్క అందించి స్వాగతం పలికారు.


## ఇలా చేస్తే... ఆత్మహత్యలు ఆపొచ్చు

- **పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచన**

**హైదరాబాద్, మహా:** వరుసగా పోలీసుల ఆత్మహత్యల సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎన్ని ఇబ్బందులొచ్చినా తట్టుకొని నిలబడాలి తప్ప ఆత్మహత్యలు చేసుకోవొద్దంటూ పోలీసులకు ధైర్యం చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'తెలంగాణలో గత ముప్పయి రోజుల్లోనే ఆరు మంది పోలీసులు తమ విలువైన ప్రాణాలను చేజేతులా నాశనం చేసుకున్నారు. గురువారం కూడా ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పరంపర ఇంతటితో ఆగాలి. ప్రియమైన పోలీసు మిత్రులారా..., గత ముప్పై సంవత్సరాలుగా నేనూ ఆయుధాల మధ్యనే బతుకుతున్నా. సర్వీసులో ఎన్నో చెప్పుకోలేని అవమానాలు, నిరాశలు, సహచరుల అకాల మరణాల్లాంటి ఎన్నో బాధలు ఎదురయ్యాయి. కొన్ని నెలల తరబడి పోస్టింగ్ ఇవ్వకుండా నన్ను ఇంట్లో కూర్చోబెట్టారు కూడా. అయినా కూడా నేను ఎన్నడూ తాగుడుకు బానిస కాలేదు, నాకు ఎన్నడూ చావాలనిపించలేదు. భవిష్యత్తులో కూడా నాకు ఈ ఆలోచన రాదు. ఆ రహస్యం ఏంటో మీకు చెప్పాలని ఉంది. దీని వల్ల మీరు సజీవంగా, మీ కుటుంబాలు సంతోషంగా ఉంటాయనే చిన్న ఆశ నాకు ఉంది. నేను ఐపీఎస్ అధికారిని ఐనా, నాదీ మీ అందరి లాంటి నేపథ్యమే. మారుమూల ప్రాంతాల్లో చదవడం, మంచి అవకాశాల కోసం నగరాలకు రావడం, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏదో సాధించాలనే పట్టుదల తో రాత్రింబవళ్లు చదవడం, చివరికి విజయం సాధించడం. తరువాత పోలీసు అకాడమీలో ట్రైనింగ్ ఒక గొప్ప అనుభూతి. అది జీవితానికి ఒక గొప్ప క్రమశిక్షణను అలవాటు చేసింది. మూడు దశాబ్దాలుగా నాకు వచ్చిన ఈ అరుదైన అవకాశాన్ని (పోలీసు ఉద్యోగం) నిరంతరం ప్రజలకు నాకు చేతనైనంత మేలు చేయడానికే వాడాను. మీరు కూడా అలాగే వాడాలి. ఈ విషయాన్ని చాలా రోజుల తరువాత విక్టర్ ఫ్రాంకెల్ రాసిన 'అర్థం కోసం అన్వేషణ' పుస్తకంలో చదివాను. మీరు కూడా చదవండి. మీకు చావాలనిపించదు. నేను పోలీసు ఉన్నతాధికారి కావడం వల్ల నేను పుట్టి పెరిగిన ఊరు చివర్లో ఉన్న మా కాలనీ ప్రజలకు, నా స్నేహితులకు, ఒక గుర్తింపు దొరికింది. నేను పోలీసు వాహనంలో మా ఊరికి పోయినప్పుడు మా బస్తీ ప్రజల ఆనందానికి అవధుల్లేవు. మీ అందరికీ ఇలాంటి అనుభవాలే ఎదురై ఉంటయి. మీరందరూ, మీ మీ సమూహాల్లో సెలబ్రిటీలు. మీ గురించి మీ తల్లిదండ్రులు మీకు తెలవకుండా చాలా గొప్పగా ఊర్లో చెప్పుకుంటరు. ఒక్క మాటలో చెప్పాలంటే మీరు మీ కుటుంబాలకు, మీ సమాజానికి సమూహానికి ఒక గొప్ప బలం.

**మీకు తెలుసా?**

మన వల్ల మనకు తెలియకుండానే ఎన్నో జీవితాలు రోజూ సురక్షితంగా ఉంటాయో? గొప్ప విలువ ఉన్న



ఇలాంటి జీవితాన్ని, ఒక పిరికి ఆలోచనతో క్షణికావేశంలో నాశనం చేసుకోకూడదు. మనం చేసే చిన్న చిన్న తప్పుల గురించి రోజుల తరబడి ఆలోచించే సమయం ఎవరికీ లేదు. తప్పులను డిలీట్ చేసుకొని మనం ముందుకు సాగాల్సిందే. నిజం చెప్పాలంటే ఎవరి బతుకుల్లో వారు బిజీగా ఉన్నారు. ఆరోగ్యం బాగాలేక పోతే డాక్టర్ దగ్గరికి పోవాలి. మరో మహిళ/పురుషుడు మన జీవితాల్లోకి అక్రమంగా ప్రవేశిస్తే అర్జెంటుగా మన జీవిత భాగస్వామితో ఆ విషయాన్ని నిర్మొహమాటంగా షేర్ చేసుకోవాలి, పరిష్కారం కనుగొనాలి. అంతేగానీ అందరికీ తెలుస్తదని భయపడి ప్రాణాలు తీసుకుంటే మీ పిల్లలు, తల్లిదండ్రులు రోడ్డు మీదపడరా? నా అనుభవంతో, కొంతమంది నిపుణులు, పోలీసు ఆఫీసర్లతో మాట్లాడి కింది సలహాలను ఇస్తున్నాను.

### రైల్వే ట్రాక్‌పై పబ్‌జీ ఆడుతూ
# ముగ్గురు యువకులు మృతి
**వేగంగా వచ్చి ఢీకొట్టిన రైలు.. చెల్లాచెదురైన యువకుల మృతదేహాలు**



**బీహార్:** రైల్వే ట్రాక్ పై ఆడుకుంటూ ముగ్గురు యువకులు దుర్మరణం చెందిన సంఘటన బీహార్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. బీహార్‌లోని వెస్ట్ చంపారన్ జిల్లాలో గురువారం రాత్రి ముగ్గురు యువకులను ఢీ కొట్టింది. రైలు వేగంగా ఢీకొనడంతో యువకుల మృతదేహాలు ముక్కలుముక్కలుగా చెల్లాచెదురయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు. కాగా, మృతులను ఫర్ఖాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా పోలీసులు గుర్తించారు. అయితే వీరు ముగ్గురు కూడా చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని.. పబ్ జీ గేమ్‌లో నిమగ్నం కావడంతో.. రైలు రాకను గమనించలేకపోయారని పోలీసులు తెలిపారు. దీంతో రైలు వారిని ఢీకొట్టిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


## మర్డర్ కేసులో గుర్మీత్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



**ఢిల్లీ:** డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు సుప్రీంకోర్టు నుంచి శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. 2002లో జరిగిన డేరా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ మర్డర్ కేసులో గుర్మీత్ కు నోటీసులు ఇచ్చింది. మరో నలుగురికి కూడా అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆ కేసు నుంచి గుర్మీత్ పేరును తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నట్లు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది. బేలా త్రివేది బెంచ్ ముందుకు ఈ కేసును పంపనున్నట్లు పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే.. హర్యానాలోని కురక్షేత్రలో ఉన్న ఖాన్పుర్ కాలనీలో 2002, జులై 10న రంజిత్ సింగ్ హత్యకు గురయ్యాడు. అనేకమంది మహిళలపై గుర్మీత్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాసి ఉన్న ఓ లేఖను రంజిత్ సింగ్ సర్క్యులేట్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ మర్డర్ కేసులో పంచకుల సీబీఐ కోర్టు 2021లో రామ్ రహీమ్‌తో పాటు మరో నలుగురిని దోషులుగా ప్రకటించింది. అయిదుగురికి జీవితఖైదు శిక్ష వేసింది. గుర్మీత్‌కు 31 లక్షల జరిమానా కూడా విధించారు.

## ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి ప్రమాణ స్వీకారం
**మణిపూర్ గవర్నర్ గా అజయ్ కుమార్**



**ఢిల్లీ:** ఒడిశా రాష్ట్ర గవర్నర్ గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం ఆయన చేత ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. రాజధాని భువనేశ్వర్ లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం మోహన్ చరణ్, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కాగా, ఏపీకి చెందిన కంభంపాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ రాజీనామా నేపథ్యంలో ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబును కేంద్ర ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను మణిపూర్ గవర్నర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో వీరివురూ శుక్రవారం ఆయా రాష్ట్రాల గవర్నర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.

## మోదీ ఇచ్చిన గిఫ్టే కాస్ట్లీదంటా
**త్వరలోనే ప్రెసిడెంట్ బాధ్యతల నుంచి దిగిపోనున్న జై బైడెన్**
**బైడెన్ దంపతులకు ఖరీదైన కానుకలిస్తున్న ప్రముఖులు**



**ఢిల్లీ:** మరికొద్ది రోజుల్లో యూఎస్ ప్రెసిడెంట్ బాధ్యతల నుంచి జో బైడెన్ దిగిపోనున్నారు. ఈ క్రమంలో ఆయనను ప్రముఖులు కలిసి ఖరీదైన బహుమతులను అందజేస్తున్నారు. జో బైడెన్ తోపాటు ఆయన సతీమణి జిల్ బైడెన్ కు కూడా ఖరీదైన బహుమతులు అందజేస్తున్నారు. ఆ గిఫ్టులు చాలా ఖరీదైనవని చెబుతున్నారు. అయితే, గిఫ్టులన్నిటిలోకెల్లా భారత ప్రధాని మోదీ ఇచ్చిన గిఫ్ట్ మాత్రం అత్యంత ఖరీదైనదిగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే... 2023లో అమెరికాలో పర్యటించిన సందర్భంగా ప్రధాని మోదీ జో బైడెన్ దంపతులకు అరుదైన కానుకలను అందజేశారు. 20 వేల అమెరికన్ డాలర్ల విలువ చేసే డైమండ్ ను మోదీ వారికి గిఫ్ట్ గా ఇచ్చారు. ఆ గిఫ్ట్ ఖరీదు ఇండియన్ కరెన్సీలో రూ. 17 లక్షలకు పైగా ఉంటుందని చెబుతున్నారు. అయితే, జోబైడెన్ దంపతులకు వచ్చిన బహుమతుల్లోకెల్లా మోదీ ఇచ్చిన కానుకనే అత్యంత ఖరీదైనదిగా సమాచారం.


## దక్షిణ కొరియా అధ్యక్షుడి అరెస్ట్ వాయిదా



సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టును వాయిదా వేస్తున్నట్లు అక్కడి పోలీసులు ప్రకటించారు. అయితే, సుమారు ఆరు గంటలపాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసులు వెనక్కి వెళ్లిపోయారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఘటనలో యూన్‌పై నిఘా సంస్థలు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

దేశంలో మార్షియల్ లాను అమలు చేయాలని గత డిసెంబర్‌లో యూన్ ప్రయత్నించిన విషయం విధితమే. అయితే, ఆ సమయంలో అధ్యక్షుడు యూన్‌పై విపక్షాలు అభిశంసన ప్రకటించాయి. ఈ నేపథ్యంలో అక్కడ తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడింది. పలు కేసుల్లో విచారణకు హాజరుకావాలని సియోల్ కోర్టు ఇటీవల ఇచ్చిన సమన్లను యూన్ బేఖాతరు చేశారు. మూడు సార్లు కోర్టు జారీ చేసిన సమన్లను ఆయన విస్మరించారు. దీంతో ఇటీవల సియోల్ కోర్టు.. యూన్ అరెస్టుకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన అరెస్టుగా పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు.

### తెలుగువారు ఎక్కడున్నా
# రాణిస్తున్నారు
**ప్రపంచ మార్కెట్ కైవసం చేసుకునే స్థాయికి..తెలుగు సినీ పరిశ్రమ చేరడం గర్వకారణం**
**హైచ్ ఐసిసిలో ప్రపంచ తెలుగు మహాసభలను ప్రారంభించిన చంద్రబాబు**





**హైదరాబాద్, మహా:** ప్రపంచ మార్కెట్ ను కైవసం చేసుకునే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ చేరుకోవడం మనందరికీ గర్వకారణమని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాదులో ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని, వివిధ రంగాల్లో తెలుగు వ్యక్తుల ఘనతలను కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి కోసం శ్రద్ధ పెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు గారిని, రామోజీరావు వంటి పెద్దలను ఒక్కసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీరంతా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. "రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, జీఎంసీ బాలయోగి, వెంకయ్యనాయుడు... సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణ వంటి తెలుగు వారు తమ పదవుల్లో రాణించారు. ఇవాళ తెలుగు వారు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. క్రీడల్లో కరణం మల్లీశ్వరితో ప్రారంభమైన ప్రస్థానం... పుల్లెల గోపీచంద్, ద్రోణవల్లి హారిక, వీవీఎస్ లక్ష్మణ్, వెంకటపతిరాజు, పీవీ సింధు, పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, మొన్ననే సెంచరీ కొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి వరకు ఎంతోమంది తెలుగువారు క్రీడల్లో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. మరోవైపు... మొన్నటివరకు చెన్నైలో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాదుకు తీసుకురావాలని మేమంతా ప్రయత్నాలు చేశాం. ఇవాళ తెలుగు ఫిలిం ఇండస్ట్రీని చూస్తే భారతదేశంలోనే నెంబర్ వన్ చిత్ర పరిశ్రమగా తయారైంది. ప్రపంచ మార్కెట్ ను కైవసం చేసుకునే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ చేరుకోవడం మనందరికీ గర్వకారణం. కూచిపూడి నృత్యం గురించి చెప్పుకోవాల్సి వస్తే... ఆ కళా రూపం మన సొంతం. ఎన్నో ఏళ్లుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ఉన్న బతుకమ్మ కూడా ఇలాంటిదే. పొట్టి శ్రీరాములు సంకల్పం మనలో ఉంది... టంగుటూరి ప్రకాశం పంతులు గుండె ధైర్యం మనలో ఉంది... అల్లూరి సీతారామరాజు పౌరుషం మనలో ఉంది... ఎన్టీఆర్ ఆత్మాభిమానం మనలో ఉంది... పీవీ నరసింహారావు చాణక్యనీతి, తెలివితేటలు మనలో ఉన్నాయి... ఇవన్నీ ఉండగా నా ఆకాంక్ష ఒక్కటే. 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ కమ్యూనిటీ ఏదంటే... దానికి చిరునామాగా తెలుగు జాతి ఉండాలనేదే నా ఆకాంక్ష. అది జరగాలంటే ఒక సంకల్పం ఉండాలి. అందుకోసం కృషి చేయాలి.


### స్మార్ట్ వర్క్ చేయాలి

ఒకప్పుడు హార్డ్ వర్క్ చేసేవారు... కానీ ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలి. ఒకప్పుడు కష్టపడి పనిచేయాలని చెప్పేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ వచ్చింది... స్మార్ట్ గా పనిచేస్తే ఏదైనా సాధ్యమే అని చెబుతున్నా. టెక్నాలజీ వల్ల నష్టాలు ఉన్నాయి, దీని వల్ల మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయని చాలామంది అంటున్నారు. అయితే టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగిస్తే ప్రపంచాన్ని కూడా



శాసించే శక్తి వస్తుంది. అదే టెక్నాలజీకి బానిసగా మారి, దుర్వినియోగం చేస్తే పిచ్చి పట్టే పరిస్థితి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలను ఏర్పాటు చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. భగవంతుడు నాకు ఎంత శక్తి ఇస్తాడో అంత శక్తినీ ఉపయోగించి... తెలుగు జాతిని నెంబర్ వన్ చేసేందుకు ఏమేం చేయాలో అవన్నీ చేస్తాను. తెలుగు జాతి అంతా ఒక్కటే... మనకు విభేదాల్లేవు. అన్ని విషయాల్లో తెలుగు వారు సమష్టిగా దూసుకుపోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఇలాంటి మహాసభల వల్ల మనలో ఉన్న సంకల్పం పట్ల పునరంకితం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది" అని చంద్రబాబు వివరించారు.

## చిలీలో భారీ భూకంపం
- అటుఇటు ఊగిపోయిన భవనాలు
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్



**చిలీ:** శాంటియాగోలోని చిలీలో భారీ భూకంపం సంభవించింది. కలమాకు 84 కిలోమీటర్ల దూరంలో అంటోఫగాస్టాలో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 6.2గా నమోదయింది. 104 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్ర ఉన్నదని యూరోపియన్ మెడిటెర్రేనియన్ సెస్మలాజికల్ సెంటర్ వివరించింది. భూకంపం వల్ల భారీగానే నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అయితే, జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాగా, భూకంపం దృశ్యాలను సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి. భూకంపం ధాటికి భవనాలు కొద్దిసేపు అటూఇటూ ఊగుతున్న దృశ్యం ఆ వీడియోల్లో కనిపిస్తుంది.


## భవనంపై కూలిన విమానం
**ఇద్దరు దుర్మరణం.. 18 మందికి గాయాలు**

**అమెరికా:** గత కొద్ది రోజుల నుంచి అమెరికాలో వరుసగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొత్త ఏడాది వేళ ఉగ్రదాడులు, ట్రక్కు బీభత్సం, పేలుళ్లతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా కాలిఫోర్నియాలో మరో ప్రమాదం సంభవించింది. ఓ ఇంటిపై విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. సౌత్ కాలిఫోర్నియాలోని ఆరెంజ్ కౌంటీ నగరం ఫుల్లర్టన్ లో ఉన్న ఓ భవనంపై విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో 18 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తును ప్రారంభించారు.

## స్విట్జర్లాండ్‌లో బురఖాపై నిషేధం
**జనవరి 1 నుంచి అమలు**



**బెర్న్:** బురఖా ధరించటాన్ని స్విట్జర్లాండ్ ప్రభుత్వం నిషేధించింది. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తమ ముఖాన్ని పూర్తిగా కప్పివుంచరాదన్న కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. జనవరి 1 నుంచి ఈ కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు అక్కడి ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీంతో బురఖాను నిషేధించిన ఏడో యూరోపియన్ దేశంగా స్విట్జర్లాండ్ నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రజా రవాణా, దుకాణాలు, రెస్టారెంట్స్ సహా బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తమ ముఖాన్ని పూర్తిగా కప్పివుంచరాదని పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘిస్తే, రూ. 98 వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది. అయితే మెడికల్ మాస్క్‌లు, చలి వాతావరణంలో రక్షణ కోసం ధరించే వాటికి మినహాయింపులను ఇచ్చింది. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాల్లో ఫేస్ కవర్లు అనుమతిస్తున్నామని పేర్కొంది.



## ఏపీలో మరో ఏడు విమానాశ్రయాలు
- ప్రస్తుతం ఏడు విమానాశ్రయాలు అందుబాటులో
- త్వరితగతిన మరో ఏడు నిర్మించాలని నిర్ణయించిన చంద్రబాబు

**కేంద్రమంత్రితో కలిసి సమీక్ష**

**అమరావతి, మహా:** ఎపిలో కొత్తగా మరో 7 విమానాశ్రయాలు రానున్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. విమానాశ్రయాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తే రాష్ట్రాభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఎయిర్‌పోర్టుల విస్తరణ, నిర్మాణం, కొత్త విమానాశ్రయాల కట్టడంపై ఎపి సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో పాటు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 7 విమానాశ్రయాలు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం విమానాశ్రయాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. కర్నూల్ ఎయిర్‌పోర్టు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా పుట్టపర్తిలో ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్ ఉంది. వీటికితోడు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మరో 7 ఎయిర్‌పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తునిఅన్నవరం, ఒంగోలులో నూతన ఎయిర్‌పోర్టులను నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది.

**7 ప్రాంతాల్లో భూ సేకరణ పూర్తి:** కుప్పం ఎయిర్‌పోర్ట్ ఫీజిబులిటీ రిపోర్ట్ సిద్ధం చేశారు. మొదటి దశలో 683 ఎకరాలు, రెండో దశలో 567 ఎకరాలు కలిపి మొత్తం 1,250 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించారు. అయితే ఈ ప్రాంతానికి సమీపంలో ఐఏఎఫ్, హెచ్ఏఎల్, బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉన్నందున ఎయిర్‌స్పేస్ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. దీనికి సంబంధిత వర్గాల నుంచి ఎన్‌వోసీ అవసరం ఉంటుంది. శ్రీకాకుళం ఎయిర్‌పోర్టు ఫీజిబులిటీ సర్వే పూర్తయింది. రెండు దశల్లో 1,383 ఎకరాల్లో నిర్మించేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే భూ సేకరణ మొదలైంది.

### ఢిల్లీని కాలుష్య రహితంగా
## తీర్చిదిద్దుతాం
**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**



**ఢిల్లీ:** వాయు కాలుష్యంతో దేశ రాజధాని ఢిల్లీ నగరం గత కొద్దిరోజుల నుంతి అతలాకుతలమైతుంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధానిలో కాలుష్యం సమస్యను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. దీనితోపాటు ఢిల్లీలో రవాణా నెట్ వర్క్ ను కూడా అభివృద్ధి పరిచనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు రూ. 12 వేలకు పైగా ఖర్చు చేయనున్నట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆయన వివరించారు. దీంతో పలు సమస్యలతో బాధపడుతున్న ఢిల్లీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఢిల్లీ కాలుష్య నగరంగా నిలుస్తుందని గడ్కరీ స్పష్టం చేశారు.

### ఛత్తీస్‌గఢ్ లో మరోసారి
## ఎదురుకాల్పులు
**ముగ్గురు మావోయిస్టులు హతం**



ఛత్తీస్‌గఢ్ లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబాద్ జిల్లా ఇందగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోలు హతమయ్యారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన సైనికులు కూడా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు నక్సలైట్లు హతమైనట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఇటవలే కూడా అక్కడ ఎన్ కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే.



## విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి డికె అరుణ
**చంద్రబాబు హయాంలో మంచి అభివృద్ధి**

**విజయవాడ, జనవరి 3:** విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి రావటం ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కుటుంబ సమేతంగా వచ్చామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయిన తరువాత రావాలి అనుకున్నామని.. మధ్యలో వరదలు వచ్చాయని.. అందుకే కొంత ఆలస్యం అయ్యిందని అన్నారు. అమ్మవారు విజయానికి ప్రతీక అని.. తనకు మంచి విజయం అందించారన్నారు. అమ్మవారి ఆశీర్వాదం తెలుగు ప్రజలు అందరికీ వుండాలి అని కోరుకున్నట్లు తెలిపారు. గతం కంటే ఇప్పుడు ఆలయం చాలా అభివృద్ధి చెందిందన్నారు. దర్శనం చాలా చక్కగా జరిగిందన్నారు. రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు రాష్ట్రం విడిపోయినప్పటికి అందరికీ మంచి జరగాలి అని కోరుకున్నానన్నారు. చంద్రబాబు నాయుడు ఇక్కడ సీఎంగా ఉండి మంచి అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఎన్డీఏలో ఉన్న సీఎం.. ఈ ప్రాంతం ఎమ్మెల్యే సుజన చౌదరి మంచి అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నట్లు ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.

**ఇంద్రకీలాద్రిపై..**

ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన ఎంపీకి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు ఎంపీ. ఆశీర్వచనం అనంతరం లడ్డూ ప్రసాదాన్ని. అమ్మవారి చిత్రపటాన్ని ఎంపీ డీకే అరుణకు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో రామచంద్ర మోహన్ అందజేశారు.

ANN తెలుగు

# మహా పత్రిక

07

శనివారం, హైదరాబాద్ | 04-01-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM



## స్టాక్ మార్కెట్లో మరో కుంభకోణం

### కేతన్ పరేఖ్ ప్రకంపనలు.. కోట్లల్లో లాభాలు కొల్లగొట్టారు!

**మహా:** స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ (సెబి) మరో ఫ్రంట్ రన్నింగ్ కుంభకోణాన్ని బయటపెట్టింది. ఇన్వెస్టర్లకు సుపరిచితమైన కేతన్ పరేఖ్ చట్టవ్యతిరేక లాభాల్ని పొందినట్లు చెప్పిన సెబీ.. అతడిపై చర్యలు తీసుకుంది. 2021 జనవరి 1 నుంచి 2023 జూన్ 30 మధ్య ట్రాన్సాక్షన్లపై విచారణ జరిపి.. ఈ అసాధారణమైన ఫ్రంట్ రన్నింగ్ స్కామ్‌లో కేతన్ పరేఖ్ పాత్ర ఉందని నిర్ధరించింది. కేతన్ రూ. 65.77 కోట్ల మేర అక్రమంగా లాభాల్ని పొందారని.. వాటిని వెనక్కి ఇవ్వాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో 22 కంపెనీలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు అందించింది. ఈ విషయమై సెబీ ఇపుడు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. సెబీ పూర్తికాల సభ్యుడు కమలేశ్ వార్ష్నీ జారీ చేసిన ఈ ఆదేశాల ప్రకారం.. 'రోహిత్ సల్గావ్కర్ (నోటీసీ నం.1), కేతన్ పరేఖ్ (నోటీసీ నం.2) ఈ కుంభకోణం మొత్తం నడిపారు. ఒక్క పెద్ద క్లయింట్‌కు చెందిన NPI నుంచి ఈ ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాల్ని నిర్వహించారు. అకోశ్ కుమార్ పొద్దార్ (నోటిసీ నం.10) ఈ కార్యకలాపాలకు మధ్యవర్తిగా ఉన్నట్లు అంగీకరించారు.' అని ఉంది. ఇక నోటిసీ నం.2, 10 లపై ఇప్పటికే సెక్యూరిటీస్ మార్కెట్లలో పాల్గొనకుండా నిషేధం ఉంది. ఇక మీదపై నోటిసీ నం. 1,2, 10 సెక్యూరిటీల్ని కొనకూడదు, అమ్మకూడదని.. సెబీ వద్ద నమోదైన ఏ ఇంటర్మీడియటరీతో అనుబంధం కొనసాగించరాదని.. ఇవి తక్షణమే అమల్లోకి వచ్చేలా సెబీ ఆదేశాలు ఇచ్చింది.

### స్కాం ఎలా జరిగిందంటే?


ఏదైనా ట్రేడ్ గురించి.. సాధారణ మదుపరుల కంటే కొందరికి మాత్రమే ముందస్తు సమాచారం ఉంటే దాన్ని ఫ్రంట్ రన్నింగ్ అంటారు. ఆ సమాచారం ఆధారంగా చేసే మోసాన్ని ఫ్రంట్ రన్నింగ్ స్కాం అంటారు. 'ఒక పెద్ద క్లయింట్‌కు చెందిన ట్రేడర్లతో రోహిత్‌కు బాగా దగ్గరి పరిచయముంది. వీరంతా తాము చేపట్టబోయే ట్రేడ్స్ సమాచారాన్ని ఆయనతో పంచుకునే వారు. ఈ సమాచారాన్ని కేతన్ పరేఖ్‌కు అందించేవారన్నమాట. దీంతోనే చట్టవ్యతిరేక లాభాల్ని ఆయన పొందారు. కేతన్ సాధారణ వ్యక్తి కాదని.. 14 ఏళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి ఇది వరకే (2000 సంవత్సరం) నిషేధం ఎదుర్కొన్నారని సెబీ వివరించింది. ఫ్రంట్ రన్నింగ్ ట్రేడ్స్‌ను కోల్‌కతా సంస్థల ద్వారా కేతన్ నిర్వహించారు. అంటే నియంత్రణ సంస్థ పరిధి వెలుపల ఉండి ఈ కథంతా నడిపించాడు. పెద్ద క్లయింట్‌కు చెందిన 90 శాతం వరకు ట్రేడ్స్‌ను కేతన్ ఒక్కరే చేయడం గమనార్హం.

## తొలివారం నష్టాలతో ముగిసిన స్టాక్స్..

### 24 వేల ఎగువన నిఫ్టీ.. సెన్సెక్స్ 720 పాయింట్లు లాస్..!

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ30 ఇండెక్స్ సెన్సెక్స్ 720.60 పాయింట్ల నష్టంతో 79,223.11 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 80,072 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 79,147.32 పాయింట్ల కనిష్ట స్థాయి వరకూ సాగింది. మరోవైపు, ఎన్ఎస్ఈ50 సూచీ నిఫ్టీ 183.90 పాయింట్లు కోల్పోయి 24,004.75 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 24,196.45 పాయింట్ల గరిష్ట స్థాయికి దూసుకెళ్లి, 23,978.15 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది.

బీఎస్ఈ30 సెన్సెక్స్ లో జోమాటో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టీసీఎస్ షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందూస్థాన్ యూనీ లివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభ పడ్డాయి. గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 75.61 డాలర్లు పలికితే, ఔన్స్ బంగారం 2670 డాలర్ల వద్ద ట్రేడయింది. బ్యాంకింగ్, ఫైనాన్సియల్, ఐటీ స్టాక్స్ మీద అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం అయ్యాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర బ్లూచిప్ కంపెనీల షేర్లపై ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు.ఎన్ఎస్ఈ50 నిఫ్టీలో 32 స్టాక్స్ నష్టాల్లోనే ముగిశాయి. విప్రో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, సిప్లా వంటి స్టాక్స్ 2.83 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు, ఓఎన్జీసీ, టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, ఎస్బీఐ లైఫ్ తదితర 18 స్టాక్స్ 5.11 శాతం వరకూ లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు - నిఫ్టీ మిడ్ క్యాప్100 సూచీ 0.30 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్100 సూచీ 0.24 శాతం నష్టాలతో ముగిశాయి. ఇక సెక్టార్ల వారీగా ఇండెక్సుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 616 పాయింట్ల నష్టంతో 50,988.80 పాయింట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ 2.53 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.94 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఓఎంసీ ఇండెక్సులు 1.26 శాతం లాభ పడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ హెల్త్ కేర్ ఇండెక్సులు 1.44 శాతం వరకూ నష్టాలతో ముగిశాయి.





## ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు మళ్లీ తగ్గాయ్..!

భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు తగ్గాయని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుక్రవారం తెలిపింది. 2024 డిసెంబర్ 27వ తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు నష్టపోయి 640.279 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ వెల్లడించింది. అంతకు ముందు డిసెంబర్ 20తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 8.478 బిలియన్ డాలర్లు పతనమై 644.391 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత కొన్ని వారాలుగా భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అవుతున్నాయి. యూఎస్ డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కాకుండా ఆర్బీఐ బహిరంగ మార్కెట్లో జోక్యం చేసుకుని డాలర్లు విక్రయిస్తున్నది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టానికి చేరుకున్నాయి. ఈ నెల 27తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏస్) 4.641 బిలియన్ డాలర్లకు పతనమై 551.921 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. బంగారం రిజర్వ్ నిల్వలు 541 మిలియన్ డాలర్లు తగ్గిపోయి 66.268 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్ఎస్) 12 మిలియన్ డాలర్లు తగ్గి, 17.873 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిల్వలు 4.217 బిలియన్ డాలర్లు యధాతథంగా కొనసాగాయి.

## మే(జో)కిన్ ఇండియా!

'మేకిన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ గడిచిన పదేండ్లుగా ఊదరగొడుతున్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఆర్భాట ప్రచారమంతా ఉత్తదేనని తేటతెల్లమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన తయారీ రంగం గతంలో ఎన్నడూ చూడని గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఉత్పాదక రంగంలో వృద్ధిరేటు ఏకంగా 12 నెలల కనిష్ఠాన్ని చేరుకోవడమే ఇందుకు రుజువు. డిసెంబర్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.4కే పరిమితమైంది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో ఉత్పత్తిలో పెరుగుదల కనిపించకుండా పోయిందని హెచ్ఎస్‌బీసీ తాజా సర్వే తేల్చిచెప్పింది. దేశ జీడీపీలో 17 శాతం వాటా కలిగిన తయారీ రంగం అంతకంతకూ కుదేలవుతున్నది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో పరిశ్రమల్లో ఉత్పత్తి దారుణంగా పడిపోతున్నది. దేశంలోని పరిశ్రమల్లో ఉత్పత్తి తీరుతెన్నులకు అద్దం పట్టే హెచ్ఎస్‌బీసీమాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గణాంకాలే ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాల్లో లోపమే ఇందుకు కారణమని పారిశ్రామికవేత్తలు ఆరోపిస్తున్నారు.

**ఆర్డర్లు లేకపోవడంతో..**

తయారీ రంగానికి సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తుల్లో వృద్ధిరేటును బేరీజువేసే మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ మరింతగా పతనమైంది. గత నవంబర్‌తో పోలిస్తే మరింతగా తగ్గి డిసెంబర్‌లో 56.4కు పరిమితమైంది. ఇది 12 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. తయారీ రంగంలో కొత్త అవకాశాలు సన్నగిల్లడంతో ఆర్డర్లు తగ్గి ఉత్పత్తిలో పెరుగుదల మందగించిందని సర్వే అభిప్రాయపడింది. భారతీయ మార్కెట్‌లో నెలకొన్న దుస్థితికి ఇది నిదర్శనంగా తెలుస్తున్నది. అంతకుముందు నెల నవంబర్‌లో 56.5 శాతంగా నమోదైన వృద్ధిరేటు మరింతగా తగ్గడంతో దేశంలో వ్యాపారపారిశ్రామిక నిర్వహణ పరిస్థితులు ఇంకా దిగజారాయని సర్వే అభిప్రాయపడింది.

**పోటీ, ఒత్తిళ్లు**

తయారీరంగం ఈ స్థాయిలో గడ్డుపరిస్థితులు ఎదుర్కోవడానికి 5 శాతం కంటే ఎక్కువగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం, పోటీ, ఒత్తిళ్లే కారణమని సర్వే అభిప్రాయపడింది. ప్రతీ పది కంపెనీలో కేవలం ఒక్క కంపెనీ మాత్రమే అదనపు కార్మికులను నియమిస్తుండగా, ప్రతీ పదిలో రెండు కంపెనీలు ఉద్యోగులను తీసివేస్తున్నట్టు సర్వే పేర్కొంది.


### భవిష్యత్తులోనూ కష్టమే!

'భారతీయ తయారీ రంగ కార్యకలాపాలు మందగమనంలో కొనసాగుతున్నాయి. గత ఏడాది వచ్చిన కొత్త ఆర్డర్లలో చెప్పుకోదగ్గ వృద్ధేమీ కనిపించలేదు. దీంతో ఉత్పాదక రంగంలో భవిష్యత్తు వృద్ధి బలహీనమే అని చెప్పవచ్చు'

# క్రీడా వార్తలు SPORTS NEWS

## సిడ్నీ టెస్టుకు దూరమై.. రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ..!

భారత్ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో చివరి మ్యాచ్ సిడ్నీ వేదికగా జరుగుతున్నది. ఈ మ్యాచ్‌లో టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగింది. ఈ మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ దూరమయ్యాడు. హిట్‌మ్యాన్ స్థానంలో శుభ్‌మన్ గిల్, ఆకాశ్ దీప్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణకు చోటు దక్కింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ విశ్రాంతి తీసుకున్నాడని స్టాండ్ఇన్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా తెలిపాడు. ఇటీవల మ్యాచ్‌కు హిట్‌మ్యాన్ దూరం కానున్నట్లు వార్తలు రాగా.. నిజంగానే మ్యాచ్‌కు రోహిత్ విశ్రాంతి తీసుకోవడం ఊహాగానాలకు హైలెట్‌గా నిలిచింది.



### వైట్ జెర్సీలో మళ్లీ కనిపించడా..?

టెస్టులకు రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడా? వైట్ జెర్సీలో మళ్లీ కనిపించడా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కాలమే సమాధానం చెప్పనున్నది. అయితే, ఇకపై టెస్టుల్లో తాను ఆడబోనని.. ఈ నిర్ణయాన్ని సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌కు చెప్పినట్లుగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. రోహిత్ తన నిర్ణయంతో ఏ స్థాయి ఆటగాడైనా.. జట్టే కీలకమని హిట్‌మ్యాన్ నిరూపించాడు.

### రోహిత్ రికార్డు

సిడ్నీ టెస్టుకు దూరమైన రోహిత్ శర్మ ఓ రికార్డును సృష్టించాడు. ద్వైపాక్షిక సిరీస్ మధ్యలో తుది జట్టు నుంచి తొలగించిన బడిన తొలి టీమిండియా కెప్టెన్‌గా నిలిచాడు. గతంలో ఏ సిరీస్ మధ్యలో భారత కెప్టెన్‌ను పక్కన పెట్టిన దాఖలాలు లేవు. అయితే, ఓవరాల్‌గా ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఈ పరిణామం నాలుగుసార్లు జరిగింది. రోహిత్ కంటే ముందుగా పాక్ మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్, శ్రీలంక మాజీ కెప్టెన్ దినేష్ చండిమాల్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ డెనెస్‌లను ప్లేయింగ్ 11 నుంచి తొలగించారు.

### తొలిసారిగా 1974లో..

తుది జట్టు నుంచి కెప్టెన్‌ను తొలగించిన ఉదంతం తొలిసారిగా 1974 యాషెస్‌లో చోటు చేసుకున్నది. సిరీస్‌లో నాలుగో టెస్ట్ నుంచి డన్నెస్ స్వయంగా తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. అతని స్థానంలో జాన్ ఎడ్రిచ్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఆ తర్వాత డెన్స్ అడిలైడ్ టెస్టులో పునరాగమనం చేసి.. తొలి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఆ తర్వాత మెల్‌బోర్న్‌లో జరిగిన సిరీస్‌లోని ఆరో టెస్టులో 181 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది.

### 2014లో.. మిస్బా, చండీమాల్

ఇదే తరహా ఘటన 2014లో రెండుసార్లు చోటు చేసుకున్నది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో మిస్బా మూడో మ్యాచ్‌లో తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత అతని స్థానంలో షాహిద్ అఫ్రిది పగ్గాలు చేపట్టాడు. అదే ఏడాది 2014 టీ20 ప్రపంచకప్ సమయంలో చివరి మూడు మ్యాచ్‌లు ఉన్న సమయంలో.. శ్రీలంక కెప్టెన్ దినేష్ చండిమాల్ తప్పుకున్నాడు. అతని స్థానంలో లసిత్ మలింగ పగ్గాలు చేపట్టాడు. మలింగ కెప్టెన్సీలో శ్రీలంక జట్టు చాంపియన్‌గా నిలిచింది. టెస్టు సిరీస్‌లో కెప్టెన్ తప్పుకోవడం 1974 తర్వాత అంటే 51 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

### ఆస్ట్రేలియా పర్యటనలో రాణించని రోహిత్

బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌లో వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు రోహిత్ దూరమయ్యాడు. అడిలైడ్ వేదికగా జరిగిన రెండు టెస్టులోకి అందుబాటులోకి వచ్చాడు. మొన్నటి మెల్‌బోర్న్ టెస్టు వరకు రోహిత్ బ్యాట్‌తో రాణించలేకపోయాడు. మూడు మ్యాచుల్లోని ఐదు ఇన్నింగ్స్‌లో కేవలం 31 పరుగులు మాత్రమే చేయగలిగాడు. సిరీస్‌లోని ఐదు ఇన్నింగ్స్‌లో వరుసగా 9, 3, 10, 6, 3 పరుగుల మాత్రమే చేయగలిగాడు. అంతకు ముందు స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల్లో 93 పరుగులు మాత్రమే చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో టీమిండియా 30 తేడాతో వైట్‌వాష్‌కు గురైంది. ఇక మెల్‌బోర్న్ టెస్టులో ప్లేయింగ్ లెవెన్ నుంచి శుభ్‌మన్ గిల్‌ను తొలగించి.. యశస్వి జైస్వాల్‌తో ఓపెనింగ్‌కు వచ్చాడు. కేఎల్ రాహుల్ మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టడంతో రోహిత్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.



## న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌ని వెనక్కి నెట్టి..

### చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్న టీమిండియా..!

ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా చెత్త ప్రదర్శన కొనసాగుతున్నది. శుక్రవారం మొదలైన సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మరోసారి విఫలమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 185 పరుగులకు కుప్పకూలింది. టీమిండియా 72.2 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. 40 పరుగులతో రిషబ్ పంత్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. అయినా, టీమిండియా బ్యాటింగ్‌లో పెద్ద తేడా మాత్రం కనిపించలేదు.

**మ్యాచ్ స్టేటస్..**

బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో చివరిదైన ఐదో టెస్ట్ తొలిరోజు ఆట ముగిసింది. భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోర్‌కే ఆలౌట్ చేసిన ఆస్ట్రేలియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగింది. ఆతిథ్య జట్టు స్టంప్స్‌కు ఒక వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. తొలిరోజు ఆట చివరి బంతినికి ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (2రన్స్) అవుట్ అయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచి ఇచ్చి అవుట్ అయ్యాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 176 పరుగులు వెనుకంజలో ఉన్నది. ప్రస్తుతం సామ్ కాన్‌స్టాస్ నాటౌట్‌గా ఉన్నాడు.

**అత్యధిక సార్లు ఆలౌట్ అయిన రెండోజట్టు భారత్..**

టీమిండియా ఓ చెత్త రికార్డు సృష్టించింది. 2024 నుంచి అత్యధిక సార్లు టెస్టుల్లో 80 ఓవర్లలోపు ఆలౌట్ అయిన రెండో జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటి వరకు టీమిండియా 14 సార్లు టెస్టుల్లో 80 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయలేకపోయింది. ఈ జాబితాలో ఇంగ్లండ్ అగ్రస్థానంలో ఉన్నది. ఇంతకు ఈ రికార్డు న్యూజిలాండ్, బంగ్లాదేశ్ పేరిట ఉండేది. ఆయా జట్లు 13సార్లు.. 80 ఓవర్లు ఆడకుండానే ఆలౌట్ అయ్యాయి. ప్రస్తుతం టీమిండియా.. ఆయా దేశాలను అధిగమించాయి.

**2000 నుంచి మూడోసారి..**


సిడ్నీ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 200 పరుగులు చేయడంలో విఫలమైంది. ఇంతకుముందు 2000లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకే కుప్పకూలింది. అయితే, 2012లో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో 191 పరుగులు మాత్రమే చేసింది. తాజాగా మరోసారి టీమిండియా 185 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

### గిల్‌కు సమన్లు




**అహ్మదాబాద్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోంజీ కుంభకోణం కేసులో భారత స్టార్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్‌కు గుజరాత్ సీఐడీ సమన్లు జారీ చేసింది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న గిల్‌తో పాటు అదే జట్టుకు చెందిన సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, మోహిత్ శర్మకు సమన్లు జారీ అయ్యాయి. బ్యాంకుల కంటే అధిక వడ్డీలు ఇస్తామని ప్రజలను మోసం చేసిన కేసులో బీజేడ్ గ్రూప్ సీఈవో భూపేంద్ర సింగ్ ఝులాను సీఐడీ ఇదివరకే అరెస్టు చేసి విచారించింది. ఈ గ్రూప్‌నకు చెందిన రూ. 450 కోట్ల లావాదేవీలలో టైటాన్స్ క్రికెటర్ల పెట్టుబడులు ఉన్నట్టు విచారణలో తేలింది. గిల్ రూ. 1.95 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్టు సమాచారం.

## మహేశ్, రాజమౌళి ప్రాజెక్ట్ రిలీజ్ ఎప్పుడో చెప్పిన రామ్ చరణ్..




అగ్ర నటుడు రామ్ చరణ్ తేజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. రామ్ చరణ్ డ్యూయల్ రోల్స్‌లో నటించిన ఈ ట్రైలర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగగా.. సినిమపై అంచనాలను మరింత పెంచింది. అయితే ఈ ట్రైలర్ ఈవెంట్‌కి రాజమౌళి ముఖ్య అతిథిగా వచ్చి సందడి చేశాడు. అయితే ఈ వేడుకలో యాంకర్ సుమ రాజమౌళి ముందు రామ్ చరణ్‌ని అడుగుతూ.. చరణ్ గారు మహేశ్ బాబు - రాజమౌళి ప్రాజెక్ట్ ఎప్పుడు విడుదల అవుతుందో చెప్పగలుగుతారా అని అడుగుతుంది. దీనికి రామ్ చరణ్ సమాధానమిస్తూ.. మళ్లీ కోవిడ్ లాంటివి ఉంటే లేట్ అవుతుందేమో కానీ ఇప్పుడు అవి లేవు కదా.. ఏడాదిన్నరలోపు ఈ సినిమా వచ్చేస్తుంది అంటూ రామ్ చరణ్ చెప్పుకోచ్చాడు. దీంతో పక్కనే రాజమౌళి మాట్లాడుతూ.. బాగానే ట్రైనింగ్ ఇచ్చాను అందుకే ఇలా చెబుతున్నాడు అంటూ నవ్వులు పూయించాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



## రూ.1799 కోట్ల క్లబ్‌లో పుష్ప-2..
# సరికొత్త రికార్డులు.!

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో ఉన్న అన్ని రికార్డులను బద్దలు కొట్టిన ఈ చిత్రం తాజాగా మరో ఘనతను అందుకుంది. ప్రభాస్ నటించిన బాహుబలి తర్వాత రూ.1800 కోట్లు సాధించిన చిత్రంగా రికార్డు అందుకోబోతుంది. ఈ చిత్రం నాలుగు వారాల్లో రూ.1799 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా రాసుకోచ్చింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఇప్పటివరకు అత్యధిక కలెక్షన్ల్ సాధించిన చిత్రాలలో 'బాహుబలి 2' చిత్రం రూ.1808 కోట్లతో రెండో స్థానంలో ఉండగా.. దీనికంటే ముందు రూ.2300 కోట్లతో ఆమీర్ ఖాన్ దంగల్ ఉంది. బాహుబలి 2ని బీట్ చేయడానికి మరో అడుగు దూరంలో ఉంది పుష్ప 2. అయితే ఈ రికార్డును కొడుతుందా లేదా అనేది చూడాలి.



## టాలీవుడ్‌లో విషాదం..
### దర్శకురాలు అపర్ణ కన్నుమూత

టాలీవుడ్‌లో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. నటి, దర్శకురాలు, నిర్మాత మల్లాది అపర్ణ (54) కన్నుమూశారు. ఆమె క్యాన్సర్‌తో పోరాడుతూ అమెరికాలోని లాస్ ఎంజెలెస్‌లో తుదిశ్వాస విడిచారు. గత రెండేళ్ల కిందట ఆమె క్యాన్సర్ బారినపడ్డారు. చికిత్సకు ఆమె శరీరం సహకరించింది. ఆ తర్వాత చికిత్సకు స్పందించలేదు. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం అమెరికా బయలుదేరి వెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఇక అపర్ణ 'ది అనుశ్రీ ఎక్స్ పెరిమెంట్స్' మూవీతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'పోష్ పోరీస్' పేరుతో వెబ్ సిరీస్‌ను సైతం తెరకెక్కించారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ రాకముందే ఆమె వెబ్ సిరీస్‌ను యూట్యూబ్‌లో విడుదల చేశారు. రెండేళ్ల కిందట 'పెళ్లికూతురు మూవీని తెరకెక్కించారు. ఆమె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు దర్శకత్వంలో మెళకువలను నేర్పించారు. ఆమె మృతితో తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం అలుముకున్నది. ఆమె మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

## హోం చీఫ్ సెక్రటరీ రవిగుప్తాతో భేటీ అయిన దిల్ రాజు..
# టికెట్ల పెంపు కోసమేనా.!



తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తాతో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నేడు భేటీ అయ్యారు. వీరితో పాటు ఈ భేటీలో ఐఅండ్ పీఆర్ కమీషనర్ హరీష్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, పలువురు ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. రామ్ చరణ్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సమావేశంలో సినిమా విడుదల, టికెట్ల రేట్లు పెంపు, బెనిఫిట్ షో అనుమతి సహా పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తుంది.



# కిరణ్ అబ్బవరం
## దిల్ రుబా టీజర్ రిలీజ్

'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి టీజర్ ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. కిరణ్ అబ్బవరం న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తుంది. నాని కృష్ణార్జున యుద్ధం సినిమా ఫేం రుక్సార్ ధిల్లాన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. మరోవైపు ఈ సినిమాను ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. గతేడాది క సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న కిరణ్ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే దిల్‌రుబాను విడుదలకు సిద్ధం చేసిన ఈ కుర్ర హీరో ఆ తర్వాత 'క' సీక్వెల్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు.

## అప్పుడే ప్రేమలో పడిపోయా!

ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనీతో కలిసి పెళ్లి పీటలెక్కింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. గోవా వేదికగా వీరిద్దరి వివాహం వైభవంగా జరిగింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆంటోనితో ప్రేమ, పెళ్లి గురించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది కీర్తి సురేష్. ఇంటర్ చదవుతున్నప్పుడే ఆంటోని ప్రేమలో పడిపోయానని, దాదాపు 15 ఏండ్లుగా తమ ప్రేమాయణం కొనసాగుతున్నదని చెప్పింది. 'ఆంటోని నాకంటే ఏడేళ్లు పెద్ద. 2010లో తను నాకు తొలిసారి లవ్‌ప్రపోజ్ చేశాడు. అప్పుడే నాకు ప్రామిస్ రింగ్‌ను బహుమతిగా ఇచ్చాడు. దానిని ఇప్పటివరకు తీయలేదు. మేమిద్దరం గత రెండేళ్లుగా పెళ్లి ప్రయత్నాల్లో ఉన్నాం. డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టాం. ఆంటోనికి పబ్లిక్‌లైఫ్‌లో కనిపించడం అంతగా ఇష్టం ఉండదు. కాస్త సిగ్గు ఎక్కువ. అందుకే మేమిద్దరం ఎప్పుడూ మీడియా ముందుకురాలేదు. ఆంటోనిలాంటి మంచివాడు నా జీవితంలోకి రావడం అదృష్టంగా భావిస్తున్నా' అని కీర్తి సురేష్ ఆనందం వ్యక్తం చేసింది.





# ఆ సినిమాతో నా జీవితం మారింది

ప్రపంచ మానవాళి అంతా.. గత ఏడాదికి విడ్కోలు పలికి, కొత్త ఏడాదికి స్వాగతం పలికేశారు. గత జ్ఞాపకాలను మనసులోనే దాచుకొని, కొత్త ఏడాది ఇచ్చే అనుభూతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల రష్మిక పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఇన్నాళ్ల జీవితంలో మీకు గర్తుండిపోయిన మధుర జ్ఞాపకం ఏంటి? అనే ప్రశ్న రష్మికకు ఎదురైంది. దానికి ఆమె సమాధానమిస్తూ.. '2016 డిసెంబర్ 30.. ఆ రోజును నా జీవితంలో మరిచిపోలేను. ఎందుకంటే.. నా తొలి సినిమా 'కిరాక్ పార్టీ' విడుదలైంది ఆ రోజే. ఆ సినిమాతో నా జీవితమే మారిపోయింది. ఆ సినిమాతో కన్నడలో బిజీ అయ్యాను. నా టాలీవుడ్ డెబ్యూ 'చలో' సినిమా ఛాన్స్ నాకొచ్చిందంటే.. కారణం 'కిరాక్ పార్టీనే'. ఆ సినిమా చూసే 'చలో'లో నన్ను తీసుకున్నారు. ఆ తర్వాత నా కెరీర్ సమూలంగా మారిపోయింది. ఇప్పుడంతా నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే.. దాని వెనుక 'కిరాక్ పార్టీ' సినిమానే ఉంది. అందుకే.. ఆ సినిమా విడుదల డేట్ నాకు ప్రత్యేకం.' అంటూ గుర్తుచేసుకున్నది అందాల రష్మిక.



## ట్రిప్‌కు రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ బైబై..
# ఎక్కడికెళ్లారో తెలుసా..?

రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్.. ఈ ఇద్దరు భామల గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలుగులో టాప్ యాక్టర్లతో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న రకుల్, ప్రగ్యా ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్నారు. ఈ ముద్దుగుమ్మలు బెస్ట్ ఫ్రెండ్స్ అని తెలిసిందే. ఇక ఎప్పుడూ ఏదో ఒక షూటింగ్ షెడ్యూల్‌తో బిజీగా ఉండే ఇటీవలే కాస్త విరామం తీసుకుని ట్రిప్ వేశారు. ఇంతకీ వీళ్లిద్దరూ ఎక్కడికెళ్లారనే కదా మీ డౌటు. ఇటీవలే ఇద్దరూ కలిసి లండన్ వెకేషన్‌కు వెళ్లారు. నా బెస్ట్ బంచ్‌తో బెస్ట్ సిటీకి. గుడ్‌బై లండన్.. మీరు ఆతిథ్యం అపూర్వం.. అంటూ ప్రగ్యాజైశ్వాల్ ట్రిప్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. లండన్ వీధుల్లో చక్కర్లు కొడుతూ క్రిస్మస్‌ను సెలబ్రేట్ చేసుకున్నారు. తమకిష్టమైన ఆహారాన్ని ఎంజాయ్ చేశారు. ప్రగ్యాజైశ్వాల్ అంతకుముందు రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ బర్త్ డే సెలబ్రేషన్స్‌లో సందడి చేసింది. ప్రగ్యా జైశ్వాల్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com